بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly BADAR Qadian

www.akhbarbadrqadian.in

సంపాదకులు: సయ్యద్ రసూల్ నియాజ్

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్

సంపుటి: 9

సంచిక : 30

వార్షిక చందా 600/-రూ॥

**25 జులై 2024 క్రీ, శ. - 25 వఫా 1403 హి, శ.**

**18 మెహర్రం 1446 హి,ఖ.**

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَاِذَا صُرِفَتۡ اَبۡصَارُهُمۡ

تِلۡقَآءَ اَصۡحٰبِ النَّارِ قَالُوۡا

رَبَّنَا لَا تَجۡعَلۡنَا مَعَ الۡقَوۡمِ الظّٰلِمِيۡنَ

అనువాదం: వారి దృష్టి నరకవాసుల వైపు త్రిప్పబడినప్పుడు వారు ఇట్లందురు. ఓ మా ప్రభువు! మమ్ములను అన్యాయములలోని వారిగా చేయకుము.

(ఆరాఫ్ : 48)

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰهُمَّ اَيِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ

وَبَارِكۡ لَنَا فِيۡ عُمُرِهٖ وَاَمۡرِهٖ

---

**ఒంటె భాగ్యంలో ఉన్నటు వంటి మరియు ప్రదర్శించునటు వంటి నాయకత్వం పట్ల విధేయత ప్రామాణికం ఎంతో ఆమోధయోగ్యమైనదని తెలుస్తుంది.**

**ఉపదేశము: సయ్యదినా హజ్రత్ మసీహ్ మౌవూద్ వ మహ్దియే మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం.**

"మేము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతమున్నబియ్యీన్ అని విశ్వసించమని నాపై, నా జమాఅత్‌పై మోపుచున్న ఆరోపణ ఒక పెద్ద నింద. మేము ఎంత శక్తి, నమ్మకము, జ్ఞానము, అనుభవముతో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతముల్ అన్బియా అని నమ్ముతామో, విశ్వసిస్తామో దాని లక్షల వంతు కూడ ఇతరులు నమ్మరు. వారి స్థాయి ఇది కానే కాదు. ఖాతముల్ అన్బియాలో నున్న వాస్తవము, గోప్యతను అర్థము చేసుకొనే చేసుకోరు. వారు తాత ముత్తాతల నుండి కేవలం ఒక పదమును వినియున్నారు. కాని దాని వాస్తవికత వారికి తెలియదు, ఖత్మె నబువ్వత్ ఏమిటో, దానిని విశ్వసించే భావమేమిటో తెలియదు. కాని మేము పూర్తి అనుభవముతో (దానిని అల్లాహ్ తాలా బాగుగా ఎరుగును) ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఖాతముల్ అన్బియా అని నమ్ముతాము. అల్లాహ్ తాలా ఖత్మె నబువ్వత్ వాస్తవికతను మాకు ఏ విధముగా తెలిపెననగా మాకు త్రాగించిన విజ్ఞాన పానీయముతో మేమొక ప్రత్యేక ఆనందము పొందుతాము. ఈ చెలిమ నుండి త్రాగిన వారు తప్ప దానిని ఎవరు అంచనా వేయలేరు." *(మల్ఫూజాత్ సంపుటి 1 పుట 241, 242)*

**మానవుడు తన మనస్సులో దైవభీతిని కల్గియుండి, సద్గుణాలతో మరియు ప్రేమాభిమానాలతో తన కార్తవ్యాన్ని నెరవేర్చినప్పుడు మాత్రమే హజ్ యాత్ర అతనికి ప్రయోజనాన్ని చేకూర్చుతుంది.**

**ఒకవేళ మానవడు స్వచ్ఛత రహితముగా వెళ్ళినచో అతడు తన పూర్వపు విశ్వాసాన్ని కూడ కోల్పోయి ఖాళి చేతులతో తిరిగి వచ్చినవాడవుతాడు.**

**(గత సంచికత తరువాత)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇలా వినిపించే వారు. ఒకానొక చలికాలంలో ఒక రైల్వే స్టేషన్‌లో ఒక అంధ వృద్ధురాలు రైలు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నది. ఆమే వద్ద కప్పుకోవడానికి ఒక దుప్పటి తప్ప మరేలాంటి చలి దుస్తువులు లేకుండెను. ఆ దుప్పటిని కూడ ఆమే రైలులో కూర్చున్న తరువాత చలిగాలి తగలకుండా కప్పుకోవడం కోసం తన వెంట తెచ్చుకున్నది. ఆమే ఆ దుప్పటిని తన ప్రక్కనే పెట్టుకున్నది ప్రతి కొన్ని నిమిషాలకు ఒకసారి ఆ దుప్పటి ఉన్నదా? లేదా? అని పట్టుకొని చూసుకునేది. ఒక వ్యక్తి ఆమే ప్రక్కనుండి వెళ్ళుచు " ఈమే అంధురాలు, పైగా బాగా చీకటిగా ఉన్నది. కావున నేను ఆ దుప్పటిని పట్టుకవెళ్ళినచో ఆ విషయం ఆమేకు గాని, చుట్టు ప్రక్కల ఉన్నవారికి గాని తెలియదు " అని ఆలోచించాడు. ఆ ఆలోచన రావడమే ఆలస్యం అతడు చడిచప్పుడు చేయకుండా ఆ దుప్పటిని పట్టుకొని వెళ్ళిపోసాగాడు. ఆ వృద్ధురాలు పదే పదే తన దుప్పటిని పట్టుకొని చూసుకునేది కావున, తన దుప్పటిని ఎవరో ఎత్తుకెళ్ళారు అనే విషయాన్ని గ్రహించింది. కావున వెంటనే ఓ హాజి సోదరుడా! నా దుప్పటిని నాకు ఇచ్చివెళ్ళుము, నేను అంధురాలిని, నా వద్ద ఆ దుప్పటి తప్ప మరేలాంటి చలి దుస్తువులు లేవు అని అరవడం ప్రారంభించింది. వెంటనే ఆ వ్యక్తి వెనుకకు తిరిగి వచ్చి ఆ దుప్పటిని నెమ్మది గా ఆమే చేతికి ఇచ్చి " ఓ వృద్ధురాలా! నేను హాజి అని నీకు ఎలా తెలిసింది?" అని అడిగాడు. అందుకు ఆ వృద్ధురాలు "ఓ యువకుడా! ఇలాంటి పనులు హాజీలు తప్ప మరేవరు కూడ చేయరు. నేను అంధురాలిని, బలహీనురాలిని, పేద మహిళను, ఇది చలి కాలం. పైగా నేను ఒంటరిగా ఉన్నాను. ఇలాంటి పరిస్థితులలో నా దగ్గర ఉన్నటు వంటి ఈ ఒక్క దుప్పటిని దొంగలించడానికి వృత్తి పరమైన ఏ దొంగ ఎన్నడు సాహసించడు. ఇలాంటి పనులు కేవలం హాజీలు మాత్రమే చేస్తారు " అని సమాధానం ఇచ్చింది.

మొత్తానికి మానవుడు తన మనస్సులో దైవభీతిని కల్గియుండి, సద్గుణాలతో మరియు ప్రేమాభిమానాలతో తన కార్తవ్యాన్ని నెరవేర్చినప్పుడు మాత్రవేం హజ్ యాత్ర అతనికి ప్రయోజనాన్ని చేకూర్చుతుంది. ఒకవేళ మానవుడు స్వచ్ఛతతో హజ్ యాత్రకు వెళ్ళినచో అతడు అమితమైన విశ్వాస భండాగారాన్ని తన వెంట తెచ్చుకున్న వాడవుతాడు. ఒకవేళ మానవడు స్వచ్ఛత రహితముగా వెళ్ళినచో అతడు తన పూర్వపు విశ్వాసాన్ని కూడ కోల్పోయి ఖాళి చేతులతో తిరిగి వచ్చినవాడవుతాడు. **(తఫ్సీరే కబీర్, సంపుటి 6, పేజి 35, ప్రచురణ ఖాదియాన్ 2010)**

## మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు

(2600) హజ్రత్ అబూహురైరహ్ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు. ఒక వ్యక్తి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకోని " నేను నాశనమై పోయాను " అని విన్నవించుకున్నాడు. అందుకు హుజూర్ (స) " ఎందుకు? " అని అడిగారు. అప్పుడు అతడు " రమజాన్ మాసంలో నేను నా భర్యతో వైవాహిక సంబంధాన్ని కొనసాగించాను" అని విన్నవించుకున్నాడు. అందుకు హుజూర్ (స) " ఒక బానిసకు స్వతంత్ర్యమును కల్పించు స్థోమత నీకు ఉన్నదా? " అని అడిగారు. అప్పుడు అతడు " లేదు" అని సమాధానం ఇచ్చాడు. అందుకు హుజూర్ (స) " నిరంతరం రెండు నెలలు ఉపవాసాలను కొనసాగించగలవా?" అని అడిగారు. అప్పుడు అతడు " కొనసాగించు సామర్థ్యం లేదు" అని సమాధానం ఇచ్చాడు. అప్పుడు హుజూర్ (స) " 60 మంది నిరుపేదలకు భోజనం తినిపించగలవా?" అని అడిగారు. అప్పుడు అతడు " అంతటి ఆర్థిక స్థోమత లేదు " అని సమాధానం ఇచ్చాడు. హజ్రత్ అబూహురైరహ్ రజి మరల ఇలా తెలిపారు. ఆ క్రమంలోనే ఒక అన్సార్ వ్యక్తి ఖర్జూరపు పండ్లతో కూడిన ఒక బుట్టను తీసుకవచ్చాడు. ఒక బుట్టలో అరఖ్ అనగా ఆ బుట్టలో 15 సాఅ లను కల్గిన ఖర్జూర ఫలములు ఉన్నాయి. ఆ సందర్భములో హుజూర్ (స) " ఈ ఖర్జూర ఫలముల బుట్టను తీసుకవెళ్ళి పేదలకు పంచిపెట్టుము " అని అన్నారు. అందుకు అతడు " ఓ రసూలుల్లాహ్ ! నా కంటే నిరుపేద స్థితిలో ఉన్నవారికి వీటిని పంచిపెట్టవలెనా?. మిమ్ములను సత్యంతో అవతరింపజేసిన ఆ అల్లాహ్ ప్రమాణం! మదీనాకు చెందిన ఈ రెండు పర్వతాల మధ్యలో ఉన్నటు వంటి ఇళ్ళలన్నింటిలో మా ఇంటి కంటే పేద ఇళ్ళు, (సహాయం కోసం ఎదురు చూసే ఇళ్ళు) ఏదియును లేదు " అని విన్నవించుకున్నాడు. అందుకు హుజూర్ (స) " (అలాగైనచో) వెళ్ళుము, నీ కుటుంబ సభ్యులకే వీటిని తినిపించుము" అని అన్నారు.

**(బుఖారి కితాబుల్ హిబా)**

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

# జుమా ప్రసంగము

ఈ మాసంలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దాసులపై తన అనుగ్రహాలను మరింత ప్రబలంగా అనుగ్రహించుటకు చాలా దయామయుడిగా మారిపోతుంటాడు. సాధారణ రోజుల్లో కూడా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దాసులకు వారు ఊహించలేని విధంగా అనుగ్రహిస్తుంటాడు.

ధార్మికతను పెంపొందించుకోవడమే ఉపవాసపు నిజమైన లక్ష్యం. లేనిచో ఉపవాసం యొక్క ప్రయోజనం శూన్యమవుతుంది.

రంజాన్ మాసంలో పవిత్ర ఖురాన్ చదవడం, బోధించడం, వినడం మరియు పఠించడంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. అల్లాహ్‌ను స్మరించుకోవడంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. నమాజ్‌ల వైపు ఎక్కువ శ్రద్ధ చూపాలి.

అసలు ఉద్దేశమైన ధార్మికతను సాధించడానికి కూడ మనం ప్రయత్నించాలి.

అల్లాహ్ కొరకు, మనం చట్టబద్ధమైన వాటికి దూరంగా ఉన్నప్పుడే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దయాప్రదమైన దృష్టిని మనపై చూపిస్తాడు మరియు మన సాతానును సంకెళ్లతో బంధిస్తాడు.

మీరు అల్లాహ్‌ను కీర్తిస్తుండాలి. ఇందుకోసం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు దైవవాణి ద్వారా నేర్పించిన ఈ దుఆను పదే పదే పఠిస్తూ ఉండాలి. అనగా సుబ్‌హానల్లాహి వబి హమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీం – అల్లాహుమ్మా సల్లిఅలా ముహమ్మదిన్ వ్వ ఆలి ముహమ్మదిన్ ఇది చాలా ప్రాధాన్యత గల దుఆ.

సత్యపరిజ్ఞానంను పొందాలని కోరుకుంటే, పవిత్ర ఖురాన్‌లోని మార్గదర్శకత్వాన్ని అధ్యయనం చేయండి మరియు దాని ప్రకారం నడుచుకోండి. ఫలితంగా, మీరు సత్యపరిజ్ఞానంనుపొందుతారు. మానవుడు అదృశ్య శక్తి అనే స్థాయి నుండి ముందుకు వెళ్ళుతాడు. అతడు యూమినైన బిల్ ఘయిబి అనే స్థాయి నుండి బయటికి వచ్చి ప్రత్యక్షముగా వీక్షించు స్థాయికి పురోగమిస్తాడు. అప్పుడు, దేవుని ఉనికికి సంబంధించి, అతడు వీక్షించు స్థాయికి చేరుకుంటాడు.

హర్ ఎక్ నేకీకి జడ్ యే ఇత్తిఖా హై – 'అగర్ యే జడ్ రహి సబ్ కుచ్ రహా హై.
"'ప్రతి మంచికి మూలం ధార్మికత. ఈ మూలాన్ని భద్రపరచినట్లయితే, ప్రతిదీ మనుగడ సాగిస్తుంది.

'ఒకానొక సందర్భంలో, ఫిద్య ఎందుకు సూచించబడిందనే ఆలోచన నా మదిలో మెదిలింది, అది అనుగ్రహం కోసమని నేను తెలుసుకున్నాను, అందువల్ల ఒకరికి ఉపవాసం ఉండే సామర్థ్యం లభిస్తుంది.

రంజాన్ నుండి మనం నిజంగా ప్రయోజనం పొందువారలం కావలెను. ఈ రంజాన్ మనకు అల్లాహ్‌కు వీలైనంత దగ్గరగా ఉండేందుకు ఒక సాధనమవ్వాలి. మనకు మన దుఆలు స్వీకరించబడు భాగ్యములు లభించుగాకా!. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అహ్మదీయులు కూడా జమాత్ విజయవంతం కావాలని మరియు అన్ని కష్టాలు తొలగిపోవాలని ప్రార్థించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనల్ని అన్ని అన్యాయ ప్రభుత్వాల నుండి మరియు ప్రతి దుష్ట వ్యక్తినుండి రక్షించుగాకా!.

**"సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 15 మార్చి 2024 (15 అమాన్ 1403) మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్ టెలిఫోర్డ్, యు.కే లో ప్రసంగించిన జుమా ప్రసంగం"**

ఈ జుమా ప్రసంగంను అల్ ఫజల్ ఇంటర్నేషనల్ లండన్ సౌజన్యంతో బదర్ ప్రచురిస్తుంది.

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُولُهٗ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

يٰۤاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِيْنَ مِنْ قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُوْنَ ۝ اَيَّامًا مَّعْدُوْدٰتٍ ؕ فَمَنْ كَانَ مِنْكُمْ مَّرِيْضًا اَوْ عَلٰى سَفَرٍ فَعِدَّةٌ مِّنْ اَيَّامٍ اُخَرَ ؕ وَعَلَى الَّذِيْنَ يُطِيْقُوْنَهٗ فِدْيَةٌ طَعَامُ مِسْكِيْنٍ ؕ فَمَنْ تَطَوَّعَ خَيْرًا فَهُوَ خَيْرٌ لَّهٗ ؕ وَاَنْ تَصُوْمُوْا خَيْرٌ لَّكُمْ اِنْ كُنْتُمْ تَعْلَمُوْنَ ۝ (البقرة:184،185)

"ఓ విశ్వాసులారా! మీరు ధార్మికులు కావలెనని మీ కంటే పూర్వమున్న వారికి విధించినట్లే మీకూ ఉపవాస నియమము విధించబడింది. (ఈ ఉపవాసం నిర్ణీత రోజులకే పరిమితమైనది. కాని మీలో ఎవరైనా అనారోగ్యంతో ఉన్నా గాని లేదా ప్రయాణంలో ఉన్నా గాని ( ఆ రోజులలో ఉపవాసము పాటించకుండా) ఇతర రోజులలో ఉపవాసమును పాటించి, ఆ సంఖ్యను పూర్తి చేయవలెను. సామర్థ్యమున్నవారు ఒక పేదవానికి అన్నము తినిపించుట పరిహారము. ఎవరైనను సత్కార్యము చేసినచో అతి అతనికి చాలా మంచిది. మీరు తెలిసి ఉపవాస నియమును పాటించినచో మీకు అది మంచిది." (బఖర:184–185)

సర్వశక్తిమంతుడైన అల్లా దయతో రంజాన్ మాసం ప్రారంభమైంది.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ మాసాన్ని అత్యంత అద్భుతమైన మరియు అపారమైన దీవెనలు కలిగిన మాసమని పేర్కొన్నారు. (సునన్ నిసాయి, కితాబుస్సౌమ్, బాబ్ జికరుల్ అఖ్‌తిలాఫ్ అలా మఅమర్‌ఫియా... హదీస్ 2108)

ఈ మాసంలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దాసులపై తన అనుగ్రహాలను మరింత ప్రబలంగా అనుగ్రహించుటకు చాలా దయామయుడిగా మారిపోతుంటాడు. సాధారణ రోజుల్లో కూడా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దాసులకు వారు ఊహించలేని విధంగా అనుగ్రహిస్తుంటాడు. ఈ నెలలో, అల్లాహ్ సాతానుకు సంకెళ్ళు వేస్తాడు మరియు దాని బారి నుండి తప్పించుకోవడానికి మన కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాడు. అందుకు తగిన ఉదాహరణను వ్యక్తపరచడానికి మన వద్ద పదాలే లేవు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వైపు మనం ముందుకు సాగినప్పుడల్లా, అల్లాహు అనుగ్రహపు తలుపులు గతంలో కంటే విశాలంగా తెరవబడి ఉండడాన్ని మనం చూస్తుంటాము. అందుకే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ మాసమును తన అనుగ్రహంలను అనుగ్రహించుట కొరకు కేటాయించాడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను ఆరాధించడంలో, నవాఫిల్ నమాజ్‌లు చేయడంలో, పవిత్ర ఖురాన్‌ను పఠించడంలో మరియు అర్థం చేసుకోవడంలో మరియు ఖుర్ఆన్

బోధనల ప్రకారం నడుచుకోవడంలో ఎవరైతే ఏ అలసత్వం ప్రదర్శించినారో, వారు వాటిని ఈ మాసంలో పూర్తి చేయడానికి అల్లాహ్ తాలా మనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాడు. అంతేగాకా విధిగావించబడిన మరియు స్వచ్ఛంద ప్రార్థనలను నెరవేర్చడానికి ఈ నెలలో ఒక నిర్దిష్ట వాతావరణం కల్పించినాడు. కాబట్టి, దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

మసీదులలో బోధనలు చేయు ఏర్పాట్లు గలవు మరియు ఎం.టి.ఏ లో కూడా ఇలాంటి కార్యక్రమాలు ప్రసారం చేయబడుతాయి. వాటి నుండి ప్రయోజనం చేకూర్చుకోవడానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సామీప్యాన్ని పొందడానికి ప్రయత్నించాలి.

మరియు ఈ వాతావరణపు ప్రభావాన్ని మన జీవితంలో శాశ్వత భాగమయ్యేలా చూసుకోవాలి. తద్వారా మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క శుభములను మరియు అనుగ్రహాలను నిరంతరం పొందుటకు అర్హులము అవుతాము. కాబట్టి, ఈ వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, నా వైపుకు రండి అని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తెల్పుచున్నాడు. తన దగ్గరికి వచ్చే తన దాసులను చూసి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పొందే ఆనందాన్ని ఆ c హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ క్రింది ప్రవచనం ద్వారా అంచనా వేయవచ్చు: హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు. ' ఒక తల్లికి తన తప్పిపోయిన కుమారుడు దొరికినప్పుడు కలిగే ఆనందం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఆనందంను 'సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దాసులు తన వైపు తిరిగినప్పుడు పొందుతాడు." (సహీబుఖారీ, కితాబుల్ అదాబ్, బాబ్ రహ్మతి అల్-వాలాద్..., హదీస్ 5999, సహి బుఖారి, కితాబు ద్దావత్ , బాబు త్తౌబతు 6308)

అనగా, అల్లాహ్ మరియు అతని దాసులకు సంబంధించిన హక్కులను నెరవేర్చని వారు లేదా వాటిని నెరవేర్చుతున్నామని భావించినప్పటికి నెరవేర్చని వారు మరియు వాటిని నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా ఉన్నవారు, వారు నిజంగా ఈ హక్కులను నెరవేర్చడం ప్రారంభించినప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు అమితమైన ఆనందం లభిస్తుంది. అల్లాహ్ స్వభావం ఎంత గొప్పదనగా, ఎప్పుడైతే అతడు తన దాసుని పట్ల ఆనందాన్ని వ్యక్తపరుస్తాడో అప్పటి నుండి తన దాసునికి అ సంఖ్యాకమైన అనుగ్రహాలను అనుగ్రహిస్తుంటాడు. కావున మనం రమజాన్ యొక్క ఈ పరిస్థితిల నుండి ప్రయోజనాన్ని పొందుతూ, వాస్తవమైన రీతిలో మనం అల్లాహ్ అనుగ్రహాలను పొందువారమైనచో నిజంగా మనం ఎంతో అదృష్టవంతులము అవుతాము.

నేను పఠించిన సూక్తులలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనలను ధార్మికతను అవలంబిస్తూ అతని ఆజ్ఞలను పాటించమని ఆదేశిస్తూ, ఉపవాసానికి సంబంధించిన కొన్ని ఆజ్ఞలను కూడా పేర్కొన్నాడు. కాబట్టి, మనం అతని సామీప్యాన్ని పొందడం కోసం మరియు అతని సామీప్యంనకు చేర్చునట్టి దగ్గరి మార్గములను ఎంచుకోవడం కోసం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ద్వారా మనకు పూర్తి విజ్ఞాన వంతమైన గ్రంథాన్ని ప్రసాదించాడు. మొదటి సూక్తిలో అల్లాహ్‌తాలా వినయ పూర్వక మార్గంలో నడవడం వైపు మన దృష్టిని ఆకర్షించాడు మరియు ఉపవాసం ద్వారా మీరు ప్రత్యేకమైన పని చేయడం లేదని బదులుగా, మీకు ముందున్న వారికి కూడా ఉపవాసం నిర్దేశించబడింది అని చెప్తూతూ, వినయాన్ని అలవర్చుకోవాలని మనకు సూచించాడు. నిజానికి, వారి ఉపవాస పద్ధతిలో తేడాలు ఉన్నాయి, అయినప్పటికీ వారికి ఉపవాసం సూచించబడింది. ధర్మమార్గాన్ని నడపడమే లక్ష్యం, కాబట్టి ఇది మీకు కూడా అదే ధర్మమార్గమును అనుసరించుము. అనగా మీరు అన్నిరకాల అనైతిక విషయాలకు దూరంగా ఉ ండండి మరియు మంచిని స్వీకరించండి. ఒక సైనికుడు ఢాలు వెనుక తనను తాను రక్షించుకోవడానికి ప్రయత్నించినట్లు మీరు కూడ పాపం మరియు దుర్మార్గాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలి. ఇంకా, తన ముందు ఢాలును అడ్డుగా పెట్టుకునే సైనికుడు తనను తాను రక్షించుకోవడమే కాకుండా శత్రువుపై దాడి కూడ చేయగలడు. కాబట్టి, మీరు కూడ నీతి మార్గంను అనుసరించినట్లైతే, మిమ్మల్ని మీరు కాపాడుకోవడమే కాకుండా సాతానుపై మరియు అన్ని రకాల సాతాను ఆలోచనలపై దాడి చేసి దానిని మరియు దాని ఆలోచలన్నింటిని చంపుతారు. ధార్మికతను అవలంబిస్తూ, తమ ఉపవాసాలకు న్యాయం చేసే మార్గం ఇదే. అలా కానిచో మీరు ఆకలితో అలమటించాల్సిన అవసరం లేదని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం చెప్పారు. (సహీబుఖారీ, కితాబుస్సౌమ్, బాబ్ మున్ లమ్ యాదా' ఖౌలజ్-జుర్, హదీస్1903)

ధార్మికతను పెంపొందించుకోవడమే ఉపవాసపు నిజమైన లక్ష్యం. లేనిచో ఉపవాసం యొక్క ప్రయోజనం శూన్యమవుతుంది.

నేటి రోజుల్లో, అత్యధిక ముసల్మానులు ఆకలితోనే ఉండడం లేదు. ముఖ్యంగా అధిక శాతం ధనవంతులు సెహ్రీ మరియు ఇఫ్తారీ సమయంలో ఆహారం వైపు చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. నిజానికి సెహ్రీ, ఇఫ్తారీలో కూడ సరిపడే ఆహారం లభించని పేదలు కూడా ఉన్నారు, కానీ వారు కూడా ధర్మమార్గాలను వెతుక్కుంటూ, వాటిని అనుసరించుటకు ప్రయత్నించినప్పుడు మరియు భక్తితో తమ ఆరాధనలను పూర్తి చేసినప్పుడే వారు ఆకలితో, దాహంతో అలమటించడం అల్లాహ్ దృష్టిలో ఆమోదయోగ్యమైనదవుతుంది. ముఖ్యంగా రంజాన్ సందర్భంగా ధనవంతులు తమ ప్రాంతాల్లోని పేదలకు తగిన సహాయాన్ని అందించాలని కూడా ఈ సందర్భముగా నేను తెల్పుచున్నాను. ఇఫ్తార్ విందులకు వారు కేవలం ధనవంతులను ఆహ్వానించుకొని ఇఫ్తార్ విందులను ఆస్వాదించకుండా, వారు పేదవారి కొరకు కూడ ఇఫ్తార్ విందులను నిర్వహించాలి. అదీకాక, పెద్ద ఎత్తున జరిగే ఇఫ్తార్ పార్టీలకు నేను అనుకూలం కాదు. ప్రస్తుతం అవి ఆడంబర మరియు దురాచార రూపంగా మారాయి.

రంజాన్ మాసంలో పవిత్ర ఖురాన్ చదవడం, బోధించడం, వినడం మరియు పఠించడంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. అల్లాహ్‌ను స్మరించుకోవడంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. నమాజ్‌ల వైపు ఎక్కువ శ్రద్ధ చూపాలి. కాని ఇక్కడ వాస్తవంగా జరిగేది ఏమిటంటే, వివిధ వృత్తుల వారు తమ ఉద్యోగాల నుండి వచ్చి నేరుగా ఇఫ్తార్ విందులలో పాల్గొనడం మరియు విందులను ఆస్వాదించడం చేస్తున్నారు. ఇఫ్తారీ విందులను ఇచ్చే వారి విషయానికొస్తే, వారు కూడ ఖురాన్‌ను, హదీసులను పఠించడం, అల్లాహ్‌ను స్మరించుకోవడం మరియు నమాజ్‌లను చదవడానికి బదులుగా, వారు ఏ విధముగా ఉత్తమమైన ఏర్పాట్లు చేయాలి?, ఇఫ్తార్ కోసం ఏ ఏ పదార్థాలను ఏర్పాటు చేయాలి?, చాలా గొప్ప ఇఫ్తారి విందును ఇచ్చారని చెప్పుకునేలా ఏ స్థాయిలో విందు ఇవ్వాలి, అనే ఆలోచనలలో, ఏర్పాట్లలోనే ఉ ంటున్నారు. ఇవన్నీ రంజాన్ మాసపు యొక్క ఉద్దేశ్యం కాదు మరియు ఇవన్నియు ధార్మికత నుండి దూరంగా తీసుకపోవునట్టి విషయాలు.

కాబట్టి, ఢాలు నుండి ప్రయోజనం పొందాలంటే, దానిని సరైన పద్ధతిలో ఉపయోగించాలి. లేనిచో ముందు, వెనుక, కుడి, ఎడమ నుండి సాతాను దాడి చేస్తే తమను తాము ఎలా రక్షించుకుంటారు?. అంతేగాకా సాతాను ఒక వ్యక్తిపై తీవ్రంగా దాడిచేసి, అతనిని తీవ్రముగా గాయపర్చగలడు. అందువల్ల, మనం రంజాన్‌లో ఉపవాసానికి న్యాయం చేయడానికి ప్రయత్నించాలి.

అసలు ఉద్దేశమైన ధార్మికతను సాధించడానికి కూడ మనం ప్రయత్నించాలి. అల్లాహ్ కొరకు, మనం చట్టబద్ధమైన వాటికి దూరంగా ఉన్నప్పుడే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన దయాప్రదమైన దృష్టిని మనపై చూపిస్తాడు మరియు మన సాతానును సంకెళ్లతో బంధిస్తాడు. ఎటువంటి అడ్డంకులు లేకుండా అమితమైన సత్కార్యములను చేపట్టు విశ్వత అవకాశాలను కల్పిస్తుంటాడు, వాటిని మనం సులువుగా వినియోగించుకోగలము. అల్లాహ్ తాలా అనుగ్రహం వలన ప్రార్థనలు మరియు దైవ స్మరణల కోట మనలను సైతాన్ దాడులు మరియు ఆటంకాల నుండి కాపాడుతూనే ఉంటుంది.

సాతానును ఎవరు కూడ తక్కువగా అంచనవేయకూడదు. అల్లాహ్ దాసులలలో అధికులు దాని మోసానికి బలి అవుతారని మరియు దానిని అనుసరిస్తారని అది పెద్ద సవాలును విసిరింది. కాబట్టి, మనం రంజాన్ మాసంలో ఈ సవాలును ఎదుర్కోవాలి. మరియు మనం ప్రార్థనలు మరియు ఖురాన్ ఆదేశాలకు అనుగుణముగా నడుచుకునే ఆయుధాలతో నిరంతరం సాతానుతో పోరాడాలి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఉపవాసం యొక్క వాస్తవాన్ని గూర్చి ఒక సందర్భంలో ఇలా తెలిపారు. "ప్రజలకు ఉపవాసం యొక్క వాస్తవికత తెలియదు. వాస్తవికత ఏమిటంటే, వారు ప్రయాణించని దేశంను గూర్చి లేదా వారికి అవగాహన లేని ప్రపంచం గూర్చి వారు ఎలా వివరించగలరు?. ఒక వ్యక్తి ఆకలి, దప్పికలతో ఉండటమే ఉపవాసం కాదు. నిజానికి ఉపవాసానికి అంటూ ఒక వాస్తవికత, ఒక ప్రభావం ఉన్నది. అనుభవం ద్వారనే అవి మనకు తెలుస్తాయి. మానవుడు ఎంత తక్కువ తింటే అంత ఎక్కువగా ఆత్మస్థైర్యం పెరుగుతుంది. దైవ స్వప్నాలను వీక్షించే సామర్థ్యం పెరుగుతుంది." దురదృష్టమేమనగా, నేడు పుష్టిగా తినడం, త్రాగడాన్నే ఉపవాసంగా భావిస్తున్నారు. ఏదేమైనప్పటికీ, హుజూర్ (అ) మరల ఇలా పేర్కొన్నారు.

" ఈ ఉపవాసం ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీరు ఒక రకమైన పోషకాన్ని తగ్గించి, మరొక రకమైన పోషకాన్ని పెంచుకోవాలని కోరుకుంటున్నాడు. కేవలం ఆకలితో ఉండడమే ఉపవాస ఉద్దేశం కాదని ప్రతి ఉపవాసి గుర్తుంచుకోవాలి.

బదులుగా అతను అల్లాహ్ స్మరణలో నిమగ్నమై ఉండాలి, తద్వారా తబత్తుల్ మరియు ఇంకితా' స్థాయిలను పొందుతాడు. అనగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌లో లీనం, నిర్లిప్తుడవుతాడు, ప్రాపంచిక ఆకర్షణలను వదులుకుంటాడు. కాబట్టి, ఉపవాసం అనగా, శరీరాన్ని పోషించే ఆహారాన్ని విడిచిపెట్టి, ఆత్మకు శాంతిని ప్రసాదించే మరియు దానిని సంతృప్తిపరిచే ఆహారాన్ని పొందడం. కావున సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కొరకు మాత్రమే ఉపవాసం ఉండేవారు, పేరుకే ఉపవాసాలు ఉండని వారు అలల్లాహ్‌ను స్తుతిస్తూ, ఆయనను కీర్తిస్తూ ఉన్నప్పుడే ఇతర పోషకాలు లభిస్తాయి. (మాల్ఫుజాత్, సంపుటి 9, పేజీలు. 122-123, ప్రచురణ 1984)

అందువల్ల, రంజాన్‌లో పవిత్ర ఖురాన్‌ను పఠించడం మరియు అర్థం చేసుకోవడంతో పాటు, అల్లాహ్‌ను ఆరాధించడం మరియు స్మరించుకోవడం కూడా చాలా ముఖ్యం. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్తుతిలో హృదయం నిమగ్నమై ఉండాలి.

మీరు అల్లాహ్‌ను కీర్తిస్తుండాలి. ఇందుకోసం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంకు దైవవాణి ద్వారా నేర్పించిన ఈ దుఆను పదే పదే పఠిస్తూ ఉండాలి. అనగా **సుబ్‌హానల్లాహి వబి హమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీం – అల్లాహుమ్మా సల్లిఅలా ముహమ్మదిన్ వ్వ ఆలి ముహమ్మదిన్** ఇది చాలా ప్రాధాన్యత గల దుఆ.

దుఆల ఆమోదం కోసం , ఆº హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్ మరియు సలాంలు పంపడం చాలా ముఖ్యం. ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆజ్ఞ. అదేవిధంగా తహ్లీల్ అనగా అల్లాహ్ తాలా యొక్క ఏకత్వంను ఆచరణల ద్వార కూడ చాటిచెప్పాలి. ఇది కూడ చాలా ముఖ్యం. ఇవి ధార్మికతను పెంచడానికి సహాయపడే సాధనాలు మరియు దుఆలు అంగీకరించబడడానికి కూడా ముఖ్యమైనవి. కాబట్టి, ఈ విషయాలపై మనం ప్రత్యేక దృష్టి పెట్టాలి.

పవిత్ర ఖురాన్‌లో లెక్కలేనన్ని సార్లు ధార్మికతను అవలంబించాలని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు సూచించాడు. ప్రతి సత్కార్యానికి ధార్మికతయే నిబంధన. అందువల్ల, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరం. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ దాదాపు ప్రతి సమావేశంలో మరియు వివిధ సందర్భాలలో ఈ విషయాన్ని మనకు గుర్తుచేశారు. హుజూర్ (అ) ఒక పంక్తిని వ్రాసారు.

"ప్రతి సత్కార్యమునకు మూలము ఈ ధార్మికతయే"

అందుకు అల్లాహ్ తాలా తన దైవవాణి ద్వారా రెండవ పంక్తిని అవతరింపజేశాడు. అనగా

ఒకవేళ ఈ మూలం (ధార్మికత) ఉన్నచో ప్రతి ఒక్కటి సాధ్యమే.

(మల్ఫూజాత్ సంపుటి 4, పేజి 48, ప్రచురణ 1984)

కాబట్టి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు ఇష్టమైనది ధార్మికత మాత్రమే. ధార్మికతయే నిన్ను ప్రతి సత్కార్యం వైపు నడిపిస్తుంది. ప్రపంచంలోని అపవిత్రత నుండి మిమ్మల్ని విడిపించేది కూడ ధార్మికతయే. భౌతికమైనా, ఆధ్యాత్మికమైనా అన్ని రకాల అవసరాలు నెరవేరేది కూడ ధార్మికత ద్వారానే. కాబట్టి, ధార్మికతను పొందడం విశ్వాసి యొక్క ప్రధాన విధిఅయ్యి ఉండాలి.

నేను చెప్పినట్లుగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు కూడ ధార్మికతకు చెందిన అంశాన్ని గూర్చి వివిధ కోణాలలో అనేక సందర్భాలలో తెలియజేశారు. ఈ సందర్భములో హుజూర్ అలైహిస్సలాం గారి కొన్ని ఉపదేశాలను మీ ముందు చదివి వినిపిస్తాను. హుజూర్ (అ) ఇలా తెలిపారు. 'పవిత్ర ఖురాన్ ప్రారంభంలోనే **హుదన్ లిల్ ముత్తఖీన్** (బఖరఅ:3) అని చెప్పబడింది. కావున ఖుర్ఆన్ షరీఫ్‌ను అర్థం చేసుకోవడానికి, అందులో పేర్కొన్నట్లుగా మార్గదర్శకం పొందడం కోసం ధార్మికత చాలా ముఖ్యం. అదే విధముగా మరొక చోట ఇలా తెలుపడం జరిగింది. **లా యమస్సుహు ఇల్లల్ ముత్తహరూన్** (వాఖిఅ:80) ఇతర బోధనలకు ఈ నిబంధన లేదు. గణితం, ఇంజనీరింగ్, ఖగోళ శాస్త్రం మరియు ఇతర సబ్జెక్టులు ఈ నిబంధనలేదు. ఈ సబ్జెక్టుల విద్యార్థి నీతిమంతుడై ఉండాలి లేదా చెడుకు దూరంగా ఉండాలనే షరతు లేదు. వారు ఎంత చెడ్డవారైనప్పటికి, చెడ్డవారు అయినప్పటికీ, వారు దానిని నేర్చుకోగలరు. ఒక విధముగా చెప్పదలచినచో ఈ రోజుల్లో, ఈ రకమైన వ్యక్తులు ఈ రంగాలలో చాలా విజయవంతంగా ఉన్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. " కాని ధార్మిక పరిజ్ఞానంలో నామమాత్రపు తత్వవేత్తలు, తర్కవేత్తలు పురోగతి సాధించలేరు మరియు హృదయాలు కలుషితమైనవారికి, నిష్టాపరత సారూప్యత లేనివారికి ఆ సత్యాలు మరియు అవగాహనలు బోధపడవు. అయినప్పటికీ, విశ్వాసం మరియు ఆధ్యాత్మిక సత్యాల జ్ఞానం వారి నాలుక నుండి ఉచ్చరించబడిందని వారు చెబితే, వారు అబద్ధం చెబుతారు. నిశ్చయంగా, వారికి విశ్వాసం యొక్క సత్యాలు మరియు అవగాహనలో ఏ మాత్రం భాగం లభించదు. వాస్తవానికి ధార్మిక ఆంతర్యము మరియు ధార్మిక అతి సూక్ష్మ పరిజ్ఞానంను పొందేందుకు నిష్టాపరత అనే నిబంధన తప్పనిసరి. క్రింది పర్షియన్ ద్విపదలో ఇలా గలదు.

عروسِ حضرتِ قرآں نقاب آنگہ بر دارد

کہ دارُالملک معنے را کُند خالی زِ ہر غوغا''

"" (ఒకరి) అంతరంగిక నగరంలో అన్ని శబ్దాలు మరియు కోలాహలంలు ప్రక్షాళన చేయబడినప్పుడు మాత్రమే ఖురాన్ తన ముసుగును వధువులాగా పైకి లేపుతుంది." హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు. " ఈ మార్పు చేకూరనంత వరకు మరియు మనో కేంద్రం ఖాళీగా ఉండనంత వరకు " అనగా మనస్సు అనే నగరం ప్రాపంచికత అనే మలినం నుండి పరిశుభ్రం కావడం తప్పనిసరి. ఒకవేళ మనస్సు ఖాళి కానిచో ఎలాంటి ప్రయోజనం చేకూరదు. మరల ఇలా తెలిపారు. " ఆ అలజడి ఏమిటి?" (శబ్దం మరియు కలకలం అంటే ఏమిటి?) "అది చెడు మరియు దుర్మార్గం". ఈ ఆర్భాటం అంతా కేవలం చెడు మరియు దుర్మార్గం. "ఇది ప్రపంచం పట్ల ప్రేమ. నిజానికి, వారు ఏదైనా చెబితే, వారు దొంగల వలె చేస్తారు, ఇది ఒక ప్రత్యేక అంశం, "అంటే అలాంటి వ్యక్తి ఎప్పుడైనా మంచిగా చెప్పగలిగితే, అవి అతని స్వంత మాటలు కావు, అతను ఇతరుల నుండి దొంగిలించిన పదాలు. "అయితే పరిశుద్ధాత్మతో మాట్లాడేవారు ధార్మికరహితంతో మాట్లాడరు.

అన్ని రకాల ధార్మిక అంశాల పరిజ్ఞానానికి ధార్మికత కీలకమని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి. మానవుడు నిష్టాపరత లేకుండాద దేనిని నేర్చుకోలేడు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు: **అలీఫ్ లామ్ మీమ్ ం జాలికల్ కితాబు లలా రయిబ ఫీహి హుదన్ లిల్ ముత్తఖీన్ ం** (బఖర: 2-3) ఈ గ్రంథం నీతిమంతులకు మార్గనిర్దేశం చేస్తుంది మరియు అలాంటి వ్యక్తులు ఎవరు? అల్లజీన యూమినూన బిల్ ఘయిబి (బఖర:4) అనగా "'అదృశ్య అంశాలను కూడ విశ్వసించే వారు.' "మరో మాటలో చెప్పాలంటే, వారు సర్వశక్తిమంతుడైన దేవుడిని చూడలేరు, ఖచ్చితముగా ఉన్నాడని అనుభవ పూర్వకముగా గ్రహించలేదు. అయినప్పటికీ వారు అల్లాహ్ ఉన్నాడు అని అల్లాహ్‌ను విశ్వసిస్తున్నారు. ఇంకా, వారు ప్రార్థనను స్థాపించేవారు. అంటే, వారు ఇంకా ప్రార్థనలో నిజమైన ఆనందం మరియు అనుభూతిని పొందలేదు, ప్రార్థనలను స్థాపించడం అనగా ఇంకా వారికి పూర్తి ఆనందం, అనుభూతి లభించలేదు. అయినప్పటికీ, వారు తమ ప్రార్థనలను ఎటువంటి ఆనందం,అనుభూతి మరియు పరధ్యానంలో లేకుండా కొనసాగిస్తూనే ఉంటారు. అంతేగాక, అల్లాహ్ వారికి అనుగ్రహించిన వాటిలో నుండి వారు ఖర్చు చేస్తారు మరియు వారు నీపై అవతరించిన దానిని. నీ కంటే ముందు అవతరించిన దానిని కూడ విశ్వసిస్తారు." మరల ఇలా తెలిపారు. "ఇవి నిష్టాపరుడి యొక్క ప్రారంభ దశలు మరియు లక్షణాలు." ఇవి విశ్వాసపు యొక్క ప్రాథమిక లక్షణాలు. స్థాయిలు మరియు లక్షణాలు ఉంటాయి. ఈ విశ్వాస విశిష్టతలు ఉండాలి. అదృశ్య అంశాలను విశ్వసించడం, నమాజ్‌ను స్థాపించడం వంటివి విశ్వాసపు ప్రారంభపు లక్షణాలు. మరల ఇలా తెలిపారు... " "ఇక్కడ, ప్రజలు ఒక ఆరోపణను లేవనెత్తారు: అల్లాహును విశ్వసించుతారు, ప్రార్థనలు చేస్తారు, దేవుని మార్గంలో ఖర్చు చేస్తారు. మరియు దేవుని నుండి అవతరించబడిన గ్రంథాలను కూడా విశ్వసించుతారు. మరి ఇవి కాకుండా క్రొత్త మార్గదర్శకాలు ఏవి?." వీటిని వారు ముందు నుండే కొనసాగిస్తున్నారు. ఇప్పుడు దీనిని మించి ఏ స్థాయికి పెరగాలి? "ఒక విధముగా చెప్పాలంటే ఇది గతంలో ఉన్నదానిని మరల పొందడమే అంటారు." అంటే, వారు ఇప్పటికే సాధించిన దానిని మరల వారు పొందుతారు. మరల ఇలా తెలిపారు. "ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటంటే, పైన పేర్కొన్న పదాలు మరియు గద్యాలు మానవులు సాధించగలిగే అత్యున్నత స్థాయి ప్రవర్తన మరియు పరిపూర్ణ జ్ఞానాన్ని తెలియజేయలేదు." (ఈ గద్యాలు మరియు అందులోని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆజ్ఞలు నిజమే అయినప్పటికీ, ఇది అంతిమ ఫలితం మరియు అంతిమ లక్ష్యం కాదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను మరియు అదృశ్య శక్తిని విశ్వసించడం, నమాజ్ చేయడం, నమాజ్‌లో భక్తితో చదవలేనప్పుడు మరల భక్తితో పూర్తి శ్రద్ధతో చదువుటకు ప్రయత్నించడం, కొంచెం ఖర్చు చేయడం ఇవన్నీ మనల్ని ధర్మం వైపు నడిపించే ప్రాథమిక సిద్ధాంతాలు. మరల ఇలా తెలిపారు. ,

"ఈ మార్గదర్శకత్వం యొక్క చివరి దశ యూమినూన బిల్ ఘయిబి వరకు ఉన్నచో మరి నిజమైన పరిజ్ఞానం యొక్క నిర్వచనం ఏమిటి?." ఒకవేళ అదృశ్య శక్తిని విశ్వసించడమే మార్గనిర్దేశం అయినచో మరి సత్య పరిజ్ఞానం అంటే ఏమిటి?.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను మనం నిజంగా ఎలా గుర్తిస్తాము? " అందుకే పవిత్ర ఖురాన్‌లో ఉన్న మార్గదర్శకత్వం ప్రకారం నడుచుకునే వారు అత్యున్నత స్థాయిలను పొందుతారు."

సత్యపరిజ్ఞానంను పొందాలని కోరుకుంటే, పవిత్ర ఖురాన్‌లోని మార్గదర్శకత్వాన్ని అధ్యయనం చేయండి మరియు దాని ప్రకారం నడుచుకోండి. ఫలితంగా, మీరు సత్యపరిజ్ఞానంనుపొందుతారు. మానవుడు అదృశ్య శక్తి అనే స్థాయి నుండి ముందుకు వెళ్ళుతాడు. అతడు యూమినైన బిల్ ఘయిబి అనే స్థాయి నుండి బయటికి వచ్చి ప్రత్యక్షముగా వీక్షించు స్థాయికి పురోగమిస్తాడు. అప్పుడు, దేవుని ఉనికికి సంబంధించి, అతడు వీక్షించు స్థాయికి చేరుకుంటాడు. ఆచరణ చేసినప్పుడే అనుల్ యఖీన్ (ప్రత్యక్ష వీక్షణ) స్థాయికి చేరుకుంటాడు.

కాబట్టి, **యూమినూన బిల్ ఘయిబి** స్థాయి నుండి ఉన్నత స్థాయికి చేరడానికి పవిత్ర ఖురాన్ యొక్క ఆజ్ఞలకు కట్టుబడి ఉండాలి. అదృశ్యశక్తిని నమ్మడం ఎందుకు అని ప్రజలు తరచుగా ఆలోచిస్తారు. 'ఎందుకు' అనే ప్రశ్న యువత మరియు పిల్లలలో తరచుగా తలెత్తుతుంది. మనకు తెలియని దానిని మనం ఎందుకు నమ్మాలి? అదృశ్య శక్తిని విశ్వసించడం దాని ప్రాథమిక స్థితి విశ్వాసం అని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పేర్కొన్నాడు. మీకు ఇవ్వబడిన ఈ పుస్తకంపై మీరు మీ విశ్వాసాన్ని ఏర్పరచుకున్న తర్వాత, దాని ఆజ్ఞలను పాటించడం బాధ్యతై ఉంటుంది, ఇది సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను నిజంగా గుర్తించడానికి మిమ్మల్ని సహకరిస్తుంది. ఫలితంగా, మీరు అదృశ్య శక్తి నుండి ప్రత్యక్ష వీక్షణ స్థాయికి పురోగమిస్తారు. కేవలం అదృశ్య శక్తిని విశ్వసించడంతో సరిపోదు. బదులుగా, దేవుడు ఎవరో అతను నిజంగా వీక్షిస్తాడు. ఇది కూడా భౌతిక ప్రపంచం యొక్క చట్టం. శాస్త్రవేత్తలు మరియు పరిశోధకులు కూడా వారి ప్రయోగాలకు ముందు, వారు ఒక పరికల్పనను ఏర్పరుచుకుంటారు, అది వారి పరిశోధనకు పునాది అవుతుంది. పరికల్పన ధృవీకరించబడినా లేదా నిర్ధారించబడకపోయినా, ఇప్పటికీ ఇది ఆమోదయోగ్యమైన మరియు తదుపరి పరిశోధనకు ఆధారంగా ఉపయోగించబడుతుంది. అదేవిధంగా, అగోచరమైన వాటిపై నమ్మకంతో పవిత్ర ఖురాన్ యొక్క ఆజ్ఞలను గురించి ఆలోచించి, కట్టుబడి ఉండేందుకు మీరు చేసే ప్రయత్నాలను ముందుగా నిర్ణయించాలని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ చెబుతున్నాడు, ఆపై మీరు దేవున్ని ప్రత్యక్షముగా చూస్తారు.

శాస్త్రవేత్తలు వ్యక్తిగత ప్రయత్నంగా మాత్రమే పరిశోధనను నిర్వహిస్తారు మరియు దానిని సాధించిన తర్వాత, వారు సాధారణ ప్రజలకు తెలియజేస్తారు. అయితే, ఈ సందర్భంలో, మీరు ఒక పరికల్పనను రూపొందించి, దానిని పరిశోధనతో అనుసరించిన తర్వాత, ప్రతి వ్యక్తి ప్రయోజనం పొందవచ్చు. ఇది ఇస్లాం వైభవం. అదృశ్యశక్తిని నమ్మడం అంటే ఇదే.

మరల ఇలా పేర్కొన్నారు. "ప్రార్థన యొక్క ప్రారంభ దశలు కూడ ఈ విధముగానే ఉంటాయి. ఇక్కడ పేర్కొన్నట్లుగా, వారు నమాజ్‌లను స్థాపించుతారు. " ఖియామ్ అనగా నమాజ్‌ను నిలబెట్టడం. "నిజానికి నమాజ్ పడిపోతూ ఉంటుంది. నమాజ్ పడిపోవడం లేదా క్షీణించడం అంటే నమాజ్‌లో భక్తి మరియు శ్రద్ధ కలుగక పోవడం. అయిష్టత మరియు ఆలోచనల పరంపర కొనసాగడం. అందుకే ఆయా నమాజ్‌లలో శోషణ మరియు చంచలత ఉండదు. మానవుడు ఆకలి దప్పికలతో ఉన్నప్పుడు అన్నపానియాల వైపు పరుగెడుతూ ఉంటాడు. అలా మానవుడు నమాజ్ వైపు పరుగెత్తలేడు. కాని ఎప్పుడైతే మార్గదర్శనంను పొందుతాడో ఆ తరువాత నుండి ఈ స్థితి ఉండదు. అతనిలో భక్తి ఏర్పడుతుంది. " నమాజ్‌లో ఒక ఆసక్తి కలుగుతుంది. " ఆలోచనల పరంపర అంతమైపోతుంది. సంతృప్తి మరియు మనశ్శాంతి లభించడం ప్రారంభమవుతాయి. " మరల ఇలా తెలిపారు. "ఒక వ్యక్తి ఒకసారి ఏదో పోగొట్టుకొని ఇలా అన్నాడు: 'ఒక నిమిషం ఆగండి, ప్రార్థన చాప తీసుకురండి. నేను ప్రార్థనలో నిమగ్నమై ఉన్నప్పుడు అది ఎక్కడ ఉందో గుర్తుకు వస్తుంది. ఇలాంటి నమాజ్ పరిపూర్ణల నమాజ్ అనబడదు. ఎందుకనగా అందులో సాతాను పరధ్యానాన్ని కలిగిస్తుంది. అనగా, ఈవ్యక్తి ఏదైనా పోగొట్టుకున్నప్పుడు మరియు అతను దానిని ఎక్కడ ఉంచాడో గుర్తుకు రానప్పుడు, అతను ప్రార్థన చేయాలని అనుకున్నాడు, ఎందుకంటే ప్రార్థనలో నిమగ్నమై ఉన్నప్పుడు అతనికి ఆలోచనలు వస్తుంటాయి మరియు ఫలితంగా, అతను దానిని ఎక్కడ ఉంచాడో అతను గుర్తుంచుకోవచ్చు. కాని సంపూర్ణ స్థాయికి చేరుకోని వారి ప్రార్థనలు. ఇవి సాతాను ఆలోచనలు. "ఎందుకంటే సంపూర్ణ స్థాయికి చేరుకున్న తర్వాత, ఈ వ్యక్తులు ఎల్లప్పుడూ ప్రార్థన స్థితిలో ఉంటారు. వారు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను నిరంతరం స్మరిస్తారు. వేల రూపాయల లాభాలు తెచ్చే వ్యాపారం కూడా పరధ్యానంగా మారవు. వారు తమ ప్రాపంచిక పనిలో పాల్గొంటారు, అయినప్పటికీ, వారు సర్వశక్తిమంతుడైన దేవునికి ఎల్లప్పుడూ భయపడతారు మరియు మనస్సులో భక్తిని పెంచుకొని ఉంటారు. మరల ఇలా తెలిపారు. "అదే విధంగా, అన్ని ఇతర దశలు కేవలం మౌఖిక వాదనలకు పరిమితం కాకుండా, వాటిలో అనుభవం కూడ కనిపిస్తుంది. అదృశ్య శక్తిని విశ్వసించే స్థాయి నుండి దైవాన్ని దర్శించే స్థాయికి చేరుకుంటారు. ఈ దశలు కేవలం మాటలతో పంచుకోవడానికి మాత్రమే కాదు, కథలు కావు. "క్షణకాలం మిమ్మల్ని సంతోషపెట్టడానికి మీకు చెప్పబడుతున్నవి కాదు. అలా కాదు, వాస్తవానికి ఇది ఒక నిధి. మీరు దీనిని వదిలి పెట్టకూడదు. దాన్ని వెలికితీయండి. ఇది ఇప్పటికే మీ స్వంత ఇంటిలో దాగి ఉంది మరియు కొంచెం ప్రయత్నం మరియు పోరాటంతో మీరు దానిని సాధించవచ్చు. (మాల్ఫుజాత్ సంపుటి 9, పేజీలు. 151-154, ప్రచురణ 1984)

కాబట్టి, ఈ రోజు, ఈ వాతావరణాన్ని సద్వినియోగం చేసుకోవడం, అన్ని రకాలుగా ప్రయత్నం చేయడం మరియు ఈ నిధిని వెలికితీసేందుకు కృషి చేయడం మన బాధ్యత, తద్వారా మనం కూడా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సామీప్యాన్ని పొందగలము.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. "గుర్తుంచుకోండి, మీరు నీతిమంతులుగా మారి, నీతిని ప్రదర్శించే వరకు మీ ప్రార్థనలు అంగీకరించబడవు. ధర్మం రెండు రకాలు: మొదటిది జ్ఞానానికి సంబంధించినది, రెండవది కర్మలకు సంబంధించినది. మన జ్ఞానానికి సంబంధించినది, ఒకరు ధర్మాన్ని అవలంబించే వరకు మతపరమైన జ్ఞానం, సత్యాలు మరియు వాస్తవాలను పొందలేరని వివరించబడింది. రెండవది, మన కర్మలకు సంబంధించినది, ప్రార్థన, ఉపవాసం మరియు ఇతర ఆరాధనలు ఒకరు నీతిమంతుడు అయ్యే వరకు అసంపూర్ణంగా ఉంటాయి. దీన్ని బాగా గుర్తుంచుకోండి. సర్వశక్తిమంతుడైన దేవునికి రెండు రకాల ఆజ్ఞలు ఉన్నాయి: మొదటిగా, మీరు అతనితో భాగస్వాములను చేయకూడదు, అతని ఉనికిలో, లేదా అతని లక్షణాలలో మరియు అతనిని ఆరాధించడంలో. రెండవది, మీరు మానవజాతి పట్ల దయతో ఉండాలి. (మాల్ఫుజాత్ సంపుటి 9, పేజి 164, ప్రచురణ 1984) అల్లా మరియు తోటి మనిషి హక్కులను నెరవేర్చండి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా తెలిపాడు. **వమన్ యత్తఖిల్లాహ యజ్‌అల్ ల్లహు మఖ్‌రజా ం వయ్యర్‌జుఖ్‌హూ మిన్ హైసు లా యహ్‌తసిబు** (అత్తలాఖ్:3-4) నిష్టాపరతను ఒక వ్యక్తి సాధించినప్పుడు, అతడు అన్ని రకాల అనుగ్రహాలను పొందినట్లే.

నిష్టాపరతను అవలంభించినచో అల్లాహ్ తాలా ఎన్నో విధాల మార్గాలను తెరుస్తాడు. మానవుని ఊహకు అందని చోట్ల నుండి సిరి సంపదలను అనుగ్రహిస్తాడు. మరల ఇలా తెలిపారు. "గుర్తుంచుకోండి, నీతిమంతుడైన వ్యక్తికి ఎప్పుడూ ఇతరుల అవసరం ఉండదు, బదులుగా, అతను ఒక ప్రమాణాన్ని చేరుకుంటాడు, దాని ద్వారా అతను కోరే ముందు కూడా దేవుడు అతను కోరుకున్నదంతా ఇస్తాడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సద్గురువులకు ప్రాపంచిక సదుపాయాలను కూడా అందిస్తానని వాగ్దానం చేశాడు. మరల ఇలా పేర్కొన్నారు, "ఒకసారి ఒక దైవస్వప్నంలో, సర్వశక్తిమంతుడైన దేవుణ్ణి మానవుని ప్రతిరూపంలో నేను చూశాను. అతడు నా మెడ చుట్టూ చేయి వేసి ఇలా అన్నాడు:

| **అహాదీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."** (కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Palakurthy, warangal, (Telangana)*

| **అహాదీస్ బోధనలు** | **"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినపుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb Babu, C.C.Kunta, Zila Mahboobnagar, (Telangana)*

జేతూc మేరా హెూరహేc సబ్ జగ్ తేరా హెూ.

అనగా""నువ్వు నాకు అంకితమైతే, ప్రపంచం మొత్తం మీదే అవుతుంది.' ఇది ప్రామాణికం. మరల ఇలా తెలిపారు. "ప్రవక్తలు, సాధువులు మరియు దైవభక్తిగల ప్రజలందరూ పరీక్షించిన ప్రామాణికం ఇదే. మీరు కూడా ప్రయత్నించాలి." మరల ఇలా తెలిపారు. ..... మన జమాత్ ధర్మమార్గంలో నడవాలి మరియు శత్రువుల నాశనంతో అనవసరంగా సంతోషించకూడదు. తౌరాత్‌లో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇజ్రాయెల్ సంతానం యొక్క శత్రువు గురించి "నేను వారి చెడు కారణంగా వారిని నాశనం చేసాను, మీరు నీతిమంతులు కాబట్టి కాదు" అని చెప్పినట్లు నమోదు చేయబడింది (వారు నాశనమయ్యారు మీ పుణ్యం వల్ల కాదు. వారి స్వంత తప్పుల వల్లనే వారు నాశనమయ్యారు.) కాబట్టి, సద్గుణవంతులుగా ఉండటానికి కృషి చేయండి. మరల ఇలా తెలిపారు. "నా ద్విపదలలో ఒకటి:

హర్ ఏక్ నేకీకి జడ్ యే ఇత్తిఖా హై

'అగర్ యే జడ్ రహి సబ్ కుచ్ రహా హై.

"'ప్రతి మంచికి మూలం ధార్మికత. ఈ మూలాన్ని భద్రపరచినట్లయితే, ప్రతిదీ మనుగడ సాగిస్తుంది.

మరల ఇలా తెలిపారు. నిష్కాపరత అనేది ఒక విరుగుడు. దానిని ఉపయోగించే వ్యక్తి అన్ని రకాల విషంల నుండి రక్షించబడతాడు. అయితే, అదిసంపూర్ణ నిష్కాపరత అయి ఉండాలి. నిష్కాపరతకు చెందిన ఏదేని ఒక శాఖను అనుసరించడం అనగా ఆకలిగా ఉన్నప్పుడు ఒక్క గింజను తినడంతో సమానం. అతడు ఆ గింజను తినడం మరియు తినకపోవడం ఒకే విధంగా ఉంటుంది. అలాగే దాహం ఒక్క చుక్కతో కూడా తీరదు. నిష్కాపరత స్థితి కూడ ఇలాగే ఉంటుంది. ఏదేని ఒక నిష్కాపరతకు చెందిన శాఖను మాత్రమే అమలు చేయడం గౌరవకారణం కాదు. అందువల్ల, అల్లాహ్ తాలా నిర్వచించినదే నిష్కాపరత. ఇన్నల్లాహ మఅ అల్లజీన త్తఖౌ. (అన్నహల్:129) దేవుని మద్దతే ఇతడు నిష్కాపరుడు అనే విషయాన్ని తెల్పుతుంది. (మాల్ఫుజాత్ సంపుటి 9, పేజీలు. 260-262, ప్రచురణ 1984)

మరో మాటలో చెప్పాలంటే, ఒకరు నిజంగా నీతిమంతుడైతే, సర్వశక్తిమంతుడైన దేవుడు తన అనుగ్రహం ద్వారా దానిని స్వయంగా వ్యక్తపరుస్తాడు మరియు ఆ అనుగ్రహాలు కూడా వ్యక్తమవుతాయి. అందుకే, ఈ నిష్కాపరతనే మనం సాధించడానికి ప్రయత్నించాలి.

మరల ఇలా తెలిపారు. "ఇది పదేపదే చెప్పబడింది (అదే భావనలు పదే పదే ప్రస్తావించబడుతున్నాయి), అయినప్పటికీ, ప్రజలు అజాగ్రత్తగా మారినందున ఇలా పదే పదే బోధించవలసి వస్తుంది. ఒకవైపు, ప్రజలు సలహాలు మరియు మార్గనిర్దేశం వింటారు మరియు ధర్మాన్ని అవలంబించాలనే ఉత్సాహాన్ని పెంపొందించుకుంటారు, కానీ మళ్లీ వారు నిర్లక్ష్యంగా మారతారు. అందుకే మన జమాత్ వారు ఎట్టి పరిస్థితుల్లోనూ సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను మరచిపోకూడదని బాగా గుర్తుంచుకోవాలి. వారు ఎల్లప్పుడూ అతని నుండి సహాయం కోరుతూ ఉండాలి. అతను లేకుండా, మనిషి ఉనికియే లేదు.

అతను మిమ్మల్ని క్షణంలో అంతం చేయగలడని గుర్తుంచుకోండి. అన్ని రకాల నొప్పి మరియు ఇబ్బందులు ఉన్నాయి. ఆందోళన, భయం లేకుండా ఉండలేని స్థితిలో ఉన్నాము. ఈ లోకంలో కూడా నరకం ఉండొచ్చు, గొప్ప విపత్తులు కూడా రావచ్చు. ఇది బాగా గుర్తుపెట్టుకో." ఈ రోజుల్లో, అణు యుద్ధం గురించి చర్చలు జరుగుతున్నాయి, ఇది ఒక విధమైన నరకాన్ని కూడా సృష్టిస్తుంది. ఇతర బాంబులు కూడా అగ్ని బంతులే. మరల ఇలా తెలిపారు. "దేవుడు స్వయంగా సహాయం చేసి, తన కృప ద్వారా కష్టాన్ని తొలగించే వరకు ఎవరూ మరొకరికి సహాయం చేయలేరని లేదా మరొకరు సానుభూతి చూపలేరని మీరు బాగా గుర్తుంచుకోవాలి.

ఈ కారణంగా, ప్రతి ఒక్కరూ సర్వశక్తిమంతుడైన దేవునితో రహస్య సంబంధాన్ని కలిగి ఉండాలి. పాపం, అసభ్యత మరియు అవిధేయతలో ధైర్యంగా మారిన వ్యక్తి ప్రమాదకరమైన స్థితిలో ఉంటాడు. సర్వశక్తిమంతుడైన దేవుని కోపం వారి కోసం వేచి ఉంది. మీరు ఉదారుడైన అల్లాహ్ యొక్క దయను నిరంతరం కోరుకుంటే, మీరు ధర్మాన్ని అవలంబించాలి మరియు సర్వశక్తిమంతుడైన దేవుని అసంతృప్తిని కలిగించే వాటిని వదిలివేయాలి. ఒకరు దేవుని పట్ల భయాన్ని పెంపొందించుకునే వరకు"

ఇది చాలా ముఖ్యమైన విషయం. మరల ఇలా తెలిపారు. " ఒకరు దేవుని పట్ల భయాన్ని పెంపొందించుకునే వరకు నిజమైన నిష్కాపరతను అభివృద్ధి చేయలేరు. నీతిమంతులుగా మారడానికి కృషి చేయండి. ధర్మాన్ని పాటించని వారి వినాశనం ప్రారంభమైనప్పుడు, ధర్మాన్ని అవలంబించే వారు మాత్రమే రక్షింపబడతారు. అలాంటి సమయాల్లో, ప్రజల అవిధేయత వారిని నాశనం చేస్తుంది మరియు ప్రజల ధర్మం వారిని రక్షిస్తుంది. ఎవరైనా తమ కుతంత్రం, అల్లరి, ద్రోహంపై ఆధారపడి రక్షించబడాలని కోరుకుంటే, వారు రక్షించబడరు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అనుగ్రహం లేకుండా ఎవరూ తమ స్వంత జీవితాన్ని, సంపదను లేదా సంతానాన్ని రక్షించుకోలేరు లేదా వారు మరే ఇతర విజయాన్ని సాధించలేరు. మీరు ఖచ్చితంగా సర్వశక్తిమంతుడైన దేవునితో రహస్య సంబంధాన్ని ఏర్పరచుకోవాలి. " ఆరాధన, భగవంతుని స్మరణ మరియు దేవుని ఆజ్ఞల ప్రకారం నడుచుకోవడం ద్వారా ఈ రహస్య సంబంధాన్ని స్థాపించవచ్చు. మరల ఇలా తెలిపారు. "మీరు ఖచ్చితంగా దేవునితో ఒక రహస్య సంబంధాన్ని ఏర్పరచుకోవాలి మరియు ఆ సంబంధాన్ని మీరు రక్షించుకోవాలి.

ఈ సంబంధం స్థిరంగా ఉండాలి.

" తెలివైన వ్యక్తి ఈ సంబంధాన్ని కాపాడుకుంటాడు. ఈ సంబంధాన్ని కాపాడుకోని వ్యక్తి మూర్ఖుడు. తన చాకచక్యం గురించి గర్వించే వ్యక్తి నాశనం చేయబడతాడు. అతడు తన లక్ష్యాలను సాధించలేడు లేదా విజయవంతం కాలేడు. భూమి మరియు ఆకాశం మరియు వాటి మధ్యలో కనిపించే ప్రతిదీ గమనించండి. ఈ విశాల ప్రపంచాన్ని సర్వశక్తిమంతుడైన దేవుని రహస్య హస్తం తప్ప మరేదైనా సృష్టించగలరా? ఖచ్చితంగా కాదు! శాంతి సమయంలో భయపడే వ్యక్తి భయం సమయంలో రక్షింపబడతాడని గుర్తుంచుకోండి మరియు భయం సమయంలో భయపడటం అసాధారణమైనది కాదు. అవిశ్వాసులు, బహుదైవారాధకులు మరియు నాస్తికులు కూడా అలాంటి సమయాల్లో భయాన్ని ప్రదర్శిస్తారు. ఫిర్ఔన్ కూడ అటువంటి సందర్భంలోనే, భయంతో ఇలా అన్నాడు. ఆమన్తు అన్నహూ లా ఇలాహ ఇల్లల్లజీ ఆమనత్ బిహీ బనూ ఇస్రాయిల వ అనా మినల్ ముస్లిమీన్. (యూనుస్:91) అనగా 'ఇశ్రాయేలీయుల దేవుణ్ణి నేను విశ్వసిస్తున్నాను' . అతడు తప్ప మరో ఆరాధ్యుడు లేడు. నేను విధేయతను చూపించే వారిలో ఒకడిని. అని భయంతో చెప్పాడు. "మరల ఇలా తెలిపారు. "ఫిర్ఔన్ పొందిన ఏకైక ప్రయోజనం ఏమిటంటే, సర్వశక్తిమంతుడైన దేవుడు అతని శరీరాన్ని కాపాడుతాడని చెప్పాడు కానీ అతని ప్రాణాన్ని కాదు. చివరికి, సర్వశక్తిమంతుడైన దేవుడు అతని శరీరాన్ని ఒక వైపుకు ఉంచాడు. అతనుపొట్టి మనిషి. ఈ విధంగా, ఒక వ్యక్తి పాపం మరియు అవిధేయత వైపు పెరిగినప్పుడు, అది లా యస్తఅఖిరూన సఅతన్ వ్వలా యస్తఖ్దిమూన్ (ఆరాఫ్:35) అనే వ్యవహారంగా మారుతుంది. అనగా 'ఆ సమయం వచ్చినప్పుడు వారు ఒక్క క్షణం ఆలస్యం చేయబడరు. ఒక్క క్షణం తొందరగా వెళ్ళలేరు. కావున మరణ సమయం వచ్చినచో క్షణం వెనుకా, ముందు అంటూ ఏమి ఉండదు. కావున మానవుడు ముందు నుండే సర్వశక్తిమంతుడైన అల్లాతో సంబంధాన్ని కలిగి ఉండటానికి ప్రయత్నించాలి. " (మాల్ఫుజాత్, సంపుటి 9, పేజీలు. 369-370, ప్రచురణ 1984)

కావున మనలోని వారు తమ నిష్కాపరతను అల్లాహ్ ఆకాంక్ష మేరకు పెంచుకోవడానికి ప్రయత్నిస్తూ ఈ రంజాన్ మాసం నుండి నిజంగా ప్రయోజనం పొందేవారు అదృష్టవంతులుగా పరిగణించబడతారు.

| వర్తమాన ఖలీఫా వాఖ్యములు | "అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. " (జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

తదుపరి సూక్తి ఉపవాసానికి సంబంధించినది, ఇందులో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కొన్ని ప్రాథమిక ఆజ్ఞలను పేర్కొన్నాడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నిర్ణీత రోజులపాటు ఉపవాసం ఉండాలని సూచించినప్పటికీ, అతను తన దాసులకు సౌలభ్యాన్ని కల్పించాడు, అందువల్ల అనారోగ్యంతో లేదా ప్రయాణంలో ఉన్నవారు తమపై అనవసరంగా భారం వేయకూడదని మరియు కోలుకున్న తర్వాత లేదా ప్రయాణం ముగించిన తర్వాత సూచించిన ఉపవాసాలను పూర్తి చేయాలని ఆదేశించాడు. కావున విధిగావించబడిన వాటిని తప్పకుండా పూర్తిచేయాలి. కానీ తమపై అనవసరమైన భారం వేయకూడదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆరోగ్య కారకాలు మరియు సంభవించే అసాధారణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నాడు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒకరి నిష్టాపరత పట్ల శ్రద్ధ చూపుతాడు, ఎందుకంటే సర్వశక్తిమంతుడైన దేవుని కొరకు పూర్తిగా చట్టబద్ధమైన వాటి నుండి కూడ అతడు దూరంగా ఉంటాడు మరియు అందువల్ల అతను కష్టతరమైన స్థితిలో ఉన్న సమయంలో అతను సౌకర్యాన్ని కల్పిస్తాడు. కాబట్టి, సర్వశక్తిమంతుడైన దేవుడు నెరవేర్చలేని విధముగా ఆజ్ఞలను ఇచ్చాడు కాబట్టి, దేవుడు తమపై చాలా భారాన్ని మోపాడని కొందరు మాట్లాడుతారు. వాస్తవానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నెరవేర్చలేని కష్టతరమైన ఆజ్ఞ ఏదీయు లేదని తెలుసుకోవాలి. వాటిలో ప్రతి ఒక్కదానితో సులభమైన మార్గాలున్నాయి. మతం వారిపై భారం మోపిందని నాస్తికులు మరియు మతాన్ని వ్యతిరేకించే వారు మతం అనే చెరలో మానవులను బంధిస్తున్నారని, అది వారి మానవ హక్కులను ఉల్లంఘిస్తుందని ఆరోపిస్తూ మతపరమైన వ్యక్తులలో చెడు ఆలోచనలను సృష్టించడానికి ప్రయత్నిస్తారు. ఈ సూక్తిలో కూడ అలాంటి వారి ఆరోపణలకు సమాధానం ఉన్నది. ఉపవాసం తప్పనిసరి. మరియు ఉపవాసం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రసన్నతను పొందటానికి వీలు కల్పిస్తుంది, అయినప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనిషి యొక్క సహజ అవసరాలు మరియు పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నాడు. అందుకే అతడు సౌలభ్యాన్ని కల్పించాడు.

కాబట్టి, సంవత్సరం పొడవునా వారి ఉపవాసాలను పూర్తి చేయవచ్చు మరియు ఆర్థిక వనరులు ఉన్నవారు తమ తప్పిపోయిన ఉపవాసాలకు ప్రాయశ్చిత్తంగా నిర్దిష్ట సంఖ్యలో ఉపవాసాలను పూర్తి చేయడంతో పాటు ఫిద్య (దానం) కూడా ఇవ్వాలి. ఈ ఫిద్య ప్రతి ఒక్కరికీ బాధ్యత వహించదు, కానీ దీన్ని చేయగల సామర్థ్యం ఉన్నవారు మాత్రమే ఇవ్వాలి. తద్వారా వారు రెండు రెట్లు బహుమతిని పొందుతారు మరియు ఇది అదనపు మంచి పనిగా పరిగణించబడుతుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన అనుగ్రహాన్ని ఇచ్చే పద్ధతి ఇది. అంతేగాక, పాలిచ్చే తల్లులు లేదా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వారి వారి మార్గాలకు అనుగుణంగా ఫిదియా చెల్లించాలని ఆదేశించారు. ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అదృశ్యమైనవాటిని ఎరిగినవాడు మరియు ప్రజల ఉద్దేశాలను తెలుసుకోగలడు. అందుకే వారి ఫిద్య ఉపవాసానికి ప్రాయశ్చిత్తం అని, వారు స్వచ్ఛమైన ఉద్దేశ్యంతో ఇస్తున్నారని పేర్కొన్నారు. ఫిద్య అనేది పేదలకు సహాయం చేసే సాధనం. ఇక్కడ మానవ హక్కులను నెరవేర్చడాన్ని కూడ ఆరాధనగానే పేర్కొన్నాడు. ఫిదియా వల్ల ప్రయోజనం పొందేది ఎవరు?. పేదలు. కాని దాని ప్రతిఫలం ఆరాధనకు సమానం. ఇది ఇస్లాం దేవుడి వైభవం. అతనిలో దయానుగ్రహాలు తప్ప మరేమి లేవు. అయినప్పటికీ ఎవరైనా అతని దయను పొందడంలో విఫలమైతే, అతను అత్యంత దురదృష్టవంతుడు.

ఈ విషయంపై మరింత వివరంగా తెల్పుచూ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు: "ఒకానొక సందర్భంలో, ఫిద్య ఎందుకు సూచించబడిందనే ఆలోచన నా మదిలో మెదిలింది, అది అనుగ్రహం కోసమని నేను తెలుసుకున్నాను, అందువల్ల ఒకరికి ఉపవాసం ఉండే సామర్థ్యం లభిస్తుంది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మాత్రమే ఎవరికైన సామర్థ్యాన్ని ఇవ్వగలడు. కావున సర్వశక్తిమంతుడైన దేవుని నుండే ప్రతిదీ కోరుకోవలెను. దేవుడు సర్వశక్తిమంతుడు, అతను కోరుకుంటే, క్షయవ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి కూడా ఉపవాసం చేసే సామర్థ్యాన్ని ప్రసాదించగలడు. అందువల్ల, ఫిద్య యొక్క ఉద్దేశ్యం ఉపవాసంకు బలం మరియు సామర్థ్యాన్ని అనుగ్రహించడం మాత్రమే. ఇది దేవుని దయతో మాత్రమే సాధ్యమవుతుంది. నా అభిప్రాయం ప్రకారం, ఒక వ్యక్తి ఇలా ప్రార్థించడం శ్రేష్ఠమైనది: 'నా ప్రభూ! మీరు ఈ పవిత్ర మాసాన్ని నిర్ణయించారు మరియు నేను దానిని కోల్పోయాను. వచ్చే ఏడాది వరకు నేను బ్రతుకుతానో లేదో ఎవరికి తెలుసు, తప్పిపోయిన ఉపవాసాలను నేను తీర్చుకోగలనో? లేదో?. అని.' ఒక వ్యక్తి అతని నుండి సామర్థ్యాన్ని పొందాలి అని దుఆ చేసినచో . సర్వశక్తిమంతుడైన దేవుడు అలాంటి మానవునికి ఉపవాసం ఉండే శక్తిని ప్రసాదిస్తాడని నేను నమ్ముతున్నాను. (మాల్ఫుజాత్, సంపుటి 9, పేజీలు. 258-259, ప్రచురణ 1984)

అందువల్ల, ఉపవాసాలు ఉండడానికి ప్రయత్నించాలి. ఆ ఉపవాసాలను అల్లాహ్ తాలా అంగీకరించాలని మరియు ఉపవాసాలు ఉండే భాగ్యాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఫిద్యా కూడ ఇవ్వాలి. అయినప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మినహాయింపులను ఇచ్చిన చోట, వాటి ప్రకారం వ్యవహరించడం చాలా అవసరం. ఇదే నిజమైన నిష్టాపరత.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆజ్ఞలను పాటించడాన్నే నిజమైన ధార్మికత చెప్పుకోవచ్చును. ఈ విషయాన్ని మరింత వివరిస్తూ, ఒక సందర్భంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు. ''వాస్తవానికి, పవిత్ర ఖురాన్‌లో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నిర్దేశించిన మినహాయింపులపై ఆచరించడం కూడ ధార్మికతయే. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రయాణంలో ఉన్నవారికి లేదా అనారోగ్యంతో ఉన్నవారికి ఇతర రోజులలో ఉపవాసం ఉండడానికి మినహాయింపు ఇచ్చాడు. కాబట్టి, ఈ ఉత్తర్వుకు అనుగుణంగా ప్రతి ఒక్కరు వ్యవహరించాలి. ఒక వ్యక్తి ప్రయాణంలో ఉన్నప్పుడు లేదా అనారోగ్యంగా ఉన్నప్పుడు ఉపవాసం ఉంటే, ఇది పాపం, ఎందుకంటే తమ కోసం కాకుండా అల్లాహ్ యొక్క ఆనందాన్ని పొందడమే నిజమైన ఉద్దేశ్యం అయి ఉండాలి. అల్లాహ్ ప్రీతి అతని పట్ల చూపే విధేయతతో లభిస్తుంది. అతడు ఇచ్చిన ఆదేశానికి అనుగుణంగా నడుచుకోవాలి. అంతేగాని తనవైపు నుండి ఇష్టం వచ్చినట్టు చేయకూడదు. " తమకు నచ్చినట్లుగా వ్యవహరించ కూడదు. ఈనాటి పండితులు తమ జ్ఞాన అహంకారంతో అలా చేస్తుంటారు. ఈ రోజుల్లో, సోషల్ మీడియా అనే ప్లాట్‌ఫారమ్ ద్వారా, వారు పూర్తిగా అసంబద్ధమైన మరియు విచిత్రమైన న్యాయశాస్త్ర శాసనాలను, ఫత్వాలను జారీ చేస్తున్నారు. మొత్తానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు. "సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు: **మన్ కాన మిన్‌కుం మ్మరీజన్ అవ్ అలా సఫరిన్ ఫ ఇద్దతున్ మ్మిన్ అయ్యామిన్ ఉఖర** (బఖర:185) అయితే మీలో ఎవరైతే అనారోగ్యంతో ఉన్నారో లేదా ప్రయాణంలో ఉన్నారో అదే సంఖ్యలో ఇతర రోజులు ఉపవాసం ఉండాలి.' ఇలాంటి ప్రయాణం లేదా అలాంటి అనారోగ్యం అని ఎలాంటి నిర్దిష్ట షరతును విధించలేదు." (మాల్ఫుజాత్, సంపుటి 9, పేజీలు. 72-73, ప్రచురణ 1984)

మరల హుజూర్ (అ) ఇలా తెలిపారు. "రమజాన్ మాసంలో అనారోగ్యం లేదా ప్రయాణంలో ఉన్నప్పుడు ఉపవాసం ఉండే వ్యక్తి దేవుని స్పష్టమైన ఆజ్ఞను ఉల్లంఘించిన వాడవుతాడు. అనారోగ్యంతో లేదా ప్రయాణంలో ఉన్నవారు ఉపవాసం ఉండకూడదని సర్వశక్తిమంతుడైన దేవుడు స్పష్టంగా పేర్కొన్నాడు. బదులుగా. అతను కోలుకున్న తర్వాత లేదా తన ప్రయాణం నుండి తిరిగి వచ్చిన తర్వాత తప్పిన ఉపవాసాలను పూర్తి చేయాలి. అల్లాహ్ తాలా యొక్క ఈ ఆదేశాన్ని తప్పకుండా ఆచరించాలి. ఎందుకనగా నిజమైన మోక్షం దైవిక చిత్తానికి విధేయత చూపడం ద్వార లభిస్తుంది కాని, తమ స్వంత ఇష్టానుసారం బలవంతంగా పని చేయడం ద్వార మోక్షం లభించదు........ అయినా కూడ ఒక ప్రయాణికుడు లేదా అనారోగ్యంతో ఉన్న వ్యక్తి ఉపవాసం ఉన్నట్లయితే వారు అవిధేయత వర్గంలోకి వస్తారు. (మాల్ఫుజాత్ సంపుటి 9, పేజి 431, ప్రచురణ 1984)

ఒకసారి, ఒక వ్యక్తి రమజాన్ మాసంలో ప్రయాణంలో ఉపవాసం ఉండడాన్ని మరియు విధిగావించబడిన నమాజులను గురించి ఆం హజ్రత్ సల్లల్లాహు

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
Rajahmundry
Kadiyapu lanka, E.G.dist.
Andhra Pradesh 533126.
#email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

అలైహి వసల్లంను అడిగాడు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సమాధానం ఇచ్చారు "మీరు రంజాన్ మాసంలో ప్రయాణిస్తున్నట్లయితే, ఆ రోజుల్లో ఉపవాసం ఉండకండి." ఆ వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు, "ఓ అల్లాహ్ యొక్క ప్రవక్త! నాకు ప్రయాణంలో కూడా ఉపవాసం ఉండే శక్తి ఉంది." అల్లాహ్ యొక్క ప్రవక్త ఇలా జవాబిచ్చాడు, "నువ్వు బలవంతుడివా లేక అల్లాహ్‌నా? మరల ఇలా తెలిపారు.

నిశ్చయంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ మాసంలో ప్రయాణంలో ఉన్న లేదా అనారోగ్యంతో ఉన్నవారికి ఉపవాసం నుండి రాయితీగా సెలవు ఇచ్చాడు. మీరు ఎవరికైనా దేనినైన బహుమతిగా ఇచ్చినచో మీరు దానిని బహుమతి ఇచ్చిన వ్యక్తికి తిరిగి ఇవ్వడానికి మీలో ఎవరైనా ఇష్టపడతారా?. (కంజూలుల్ ఆమాల్, భాగం 8, పేజి 611, హదీస్ 24384, ప్రచురణ మోఅస్ససతురిసాలతు బేహ్రూత్ 1985)

కాబట్టి, అల్లాహ్ ఆజ్ఞల ప్రకారం మనం నడుచుకోవడమే నిజమైన ధార్మికత అనబడుతుంది., నిర్దేశించబడిన సమయంలో ఏ సత్కార్యమును ఆచరించమని అతడు ఆదేశిస్తాడో ఆ సమయంలోనే ఆ సత్కార్యమును నెరవేర్చండి. దేనినైతే వదిలి వేయండి అని ఆజ్ఞాపిస్తాడో వాటిని వదిలి వేయండి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన ప్రసన్నతను పొందుతూ, సన్మార్గంలో పయనిస్తూ రంజాన్ పండుగను గడపడానికి వీలు కల్పించుగాకా!. మన నిష్ఠాపరత ప్రమాణాలను పెంచుకోవడానికి ఆయన మనకు సహాయం అందించుగాకా!. ఉపవాసం ఉండకూడదని సాకులు వెతకువారిలో మనం చేరకూడదు. అనవసరమైన ఇబ్బందులను మనపై విధించుకోకూడదు. ఇస్లాం యొక్క అందమైన బోధనల ప్రకారం మనం ఎల్లప్పుడూ నడుచుకునే వారము కావలెను. ఈ రంజాన్‌లో మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క లెక్కలేనన్ని శుభములను పొందువారలము కావలెను. ప్రతిరోజూ మనకోసం శుభములను, అనుగ్రహాలను తీసుకొచ్చునది కావలెను. రంజాన్ నుండి మనం నిజంగా ప్రయోజనం పొందువారలం కావలెను. ఈ రంజాన్ మనకు అల్లాహ్‌కు వీలైనంత దగ్గరగా ఉండేందుకు ఒక సాధనమవ్వాలి. మనకు మన దుఆలు స్వీకరించబడు భాగ్యములు లభించుగాకా!. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అహ్మదీయులు కూడా జమాత్ విజయవంతం కావాలని మరియు అన్ని కష్టాలు తొలగిపోవాలని ప్రార్థించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనల్ని అన్ని అన్యాయ ప్రభుత్వాల నుండి మరియు ప్రతి దుష్ట వ్యక్తినుండి రక్షించుగాకా!.

చట్టవిరుద్ధంగా ఖైదు చేయబడిన వారి విడుదల కొరకు ప్రార్థించండి. వారిలో కొందరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మనం సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను గట్టిగా పట్టుకోవాలని, మన ఏ పొరపాటు కూడ అల్లాహ్‌తో మన బంధాన్ని తెంచకుండా ఉండాలని కూడ దుఆ చేయాలి. అల్లాహ్ తాలా అనుగ్రహపు వర్షం ఎల్లప్పుడూ మనపై కురుస్తుండాలి!.

ముస్లిం ప్రపంచం కోసం ప్రార్థించండి. అల్లాహ్ వారికి జ్ఞానం మరియు అవగాహనను ప్రసాదించుగాకా!. మరియు వారికి అవతరించిన మసీహ్ మౌవూద్ మరియు మహ్దియే మౌవూద్‌ను స్వీకరించు భాగ్యమును కల్పించుగాకా!.

అలాగే, యుద్ధం యొక్క దుష్ప్రభావాల నుండి రక్షించబడాలని ప్రార్థించండి. అధికారం కోసం జరుగుతున్న యుద్ధాల వల్ల అమాయక ప్రజలు అన్యాయాలకు గురవుతున్న ముస్లిం దేశాల కోసం ప్రార్థించండి. అల్లా వారిపై దయ చూపి, ఇటువంటి అణచివేతదారుల నుండి వారిని రక్షించుగాక.

అలాగే, ప్రపంచం యొక్క సాధారణ స్థితి కోసం ప్రార్థించండి. యుద్ధం మరియు దాని ప్రమాదకరమైన ప్రభావాల నుండి అల్లాహ్ మనలను రక్షించుగాకా!. యుద్ధం విషయంలో, అహ్మదీలు కూడా ప్రభావితమవుతారు – అల్లాహ్ వారిని రక్షించుగాకా!. దీని నుండి రక్షించడానికి ఒక మార్గం ఏమిటంటే, ప్రతి అహ్మదీ వారి నిష్ఠాపరత ప్రమాణాన్ని పెంచుకోవడం. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విషయాన్ని తెలియజేసారు. సర్వశక్తిమంతుడైన అల్లా ప్రతిఒక్కరికీ అట్టి భాగ్యమును కల్పించుగాకా!.

యూకేలో ముస్లింలకు ఇబ్బందులు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. తీవ్రవాదాన్ని ఎదుర్కోవడానికి కొత్త చట్టాలు ప్రతిపాదించబడుతున్నాయి. అయితే, ముస్లింలను లక్ష్యంగా చేసుకోవడానికే ఈ చట్టపరమైన మార్పులని విశ్లేషకులు భావిస్తున్నారు. దీని వెనుక ఉన్న ఉద్దేశాలు అల్లాహ్‌కు బాగా తెలుసు. అయినప్పటికీ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనల్ని మరియు ఇక్కడ నివసిస్తున్న ఇతర ముస్లింలను దీని దుష్ప్రభావాల నుండి రక్షించుగాకా!. ఇందుకై మనం ప్రార్థించాలి.

## హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం నిస్సందేహముగా ఖాతమున్నబియ్యీన్

ముహమ్మద్ మీ వలె నున్న పురుషులలో ఎవరికి తండ్రి కారు. వారు అల్లాహ్ ప్రవక్త, సందేశహరులనందరిని ధృవపరచునట్టివారు. అల్లాహ్ సర్వజ్ఞుడు.(అల్ అహ్‌జాబ్:41)

ఈ సూక్తి అనుసారము జగత్ ప్రవక్త, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం నిస్సందేహముగా ఖాతమున్నబియ్యీన్ అని అహ్మదియ్య జమాఅత్ మొత్తం విశ్వాసము. ఈ విషయములో ముస్లిముల ఒక్క వర్గములో కూడ విభేదము రాలేదు, లేదు, భవిష్యత్తులో కూడ రాదు.

అహ్మదియ్య జమాఅత్ ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను హృదయపూర్వకంగా ఖాతమున్నబియ్యీన్ అని విశ్వసించును. ఖత్మె నబువ్వత్ తిరస్కరణ ఆరోపణ చేయు వ్యక్తి హృదయములోని ఒక కోణములో దొంగ దాగి యున్నాడని మేమతని గురించి నమ్మకముగా చెప్పగలము. ఈ విషయమును దాచిపెట్టుటకు అతను తన హృదయ చీకటిని అహ్మదియ్య జమాఅత్ యదపై వెదజల్లి సంతృప్తి పడుచున్నాడు. వాస్తవానికి జామిఅ మస్జిద్ ఢిల్లీలో అహ్మదియ్య జమాఅత్ స్థాపకులు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం తమ విశ్వాసములను వ్యక్తపరచుచు స్పష్టమైన పదములలో ఇట్లనిరి.

"నేను విస్తారముగా ఈ క్రింది విషయములను ముస్లిముల ముందు ఈ దైవ గృహములో స్పష్టముగా తెలుపుచున్నాను. గౌ॥ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం ఖత్మె నబువ్వత్‌ను నేను విశ్వసిస్తాను. ఖత్మె నబువ్వత్‌ను విశ్వసించని వ్యక్తిని అధర్ముడని, ఇస్లాం నుండి బహిష్కృతుడని భావించెదను."

(తక్రీర్ వాజిబుల్ ఈలాన్, తబ్లీఘె రిసాలత్ సంపుటి 2 పుట 44)

ఖత్మె నబువ్వత్‌ను నమ్మరను ఈ భయానక ఆరోపణను ఖండించుచు వారిట్లనిరి.

"నేను అల్లాహ్ గౌరవ, వైభవ సాక్ష్యముగా చెప్పుచున్నాను. నేను విశ్వాసిని, ముస్లిమును. నేను అల్లాహ్ తాలా, అతని పుస్తకములు, అతని ప్రవక్తలు, అతని దేవదూతలను, మరణము తరువాతి జీవితమును విశ్వసిస్తాను. మన ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం సర్వ ప్రవక్తలలో ఉత్తములు, ఖాతమున్నబియ్యీన్ అని నా విశ్వాసము." *(అరబ్బీ పంక్తి అనువాదము: హమామతుల్ బుష్రా పుట 8)*

అహ్మదియ్య జమాఅత్ స్థాపకుల పదములలో అహ్మదియ్య జమాఅత్ ప్రతి సభ్యుడు బహిరంగముగా ఇట్లు దప్పు సాటింపు చేయుచున్నాడు, చేయుచు పోవును.

మేము ముస్లిముల ధర్మమును పాటిస్తాము. మనస్ఫూర్తిగా మేము ఖత్ముల్ ముర్సలీం సేవకులము.
అన్యారాధన, దురాచారమును మేము ద్వేషిస్తాము. మేము సర్వాధికారి అహ్మద్ (సల్లం) మార్గ ధూలిమి.
(ఓ వ్యతిరేకులారా!) మాకు మీరు అవిశ్వాస బిరుదునిస్తారు. మీకు శిక్ష గురించి ఎందుకు భయము లేదు.

కాని విచిత్రము, విపరీత దౌర్జన్యమేమనగా ఇంత స్పష్టమైన, గట్టి ప్రకటనలు, అంగీకారము, ప్రమాణ పూర్వక వ్యాఖ్యానమును లెక్క చేయకుండా గత వంద సం॥ల నుండి వ్యతిరేక విద్యావంతులు అహ్మదియ్య జమాఅత్‌పై "ఖత్మె నబువ్వత్ తిరస్కరణ" బాణములతో విరుచుకుపడుచున్నారు. "తహఫ్ఫుజె ఖత్మె నబువ్వత్" పేరున రాజకీయ నాయకులు, వారు కొనుగోలు చేసిన ముల్లాలు సామాన్య స్వభావము గల ముస్లిముల మనోభావాలను రెచ్చగొట్టడమే కాక ఇస్లామీయ అభిప్రాయములను, సూత్రములను, స్వయముగా తమ విశ్వాసములను అతి నీచము, హీనంగా అవహేళనకు గురి చేసిరి. ఎందుకగా స్వార్థపరులైన ఈ ముల్లాలు ఒక వైపు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖత్మె నబువ్వత్‌ను ఏ విధముగా నమ్ముతారనగా వారి తరువాత ప్రళయ దినము వరకు ఎటువంటి ప్రవక్త అవతరించడు. ఒక్క శ్వాసలోనే రెండవ వైపు ఒక దొంగ తలుపు తెరిచి ఖత్మె నబువ్వత్ కోటకు రంధ్రము చేసి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కంటే 6 వందల సం॥ క్రితం హజ్రత్ మూసా అలైహిస్సలాం శాసనము తౌరాత్ సేవకు స్వతంత్ర, నేరుగా అల్లాహ్ తాలాతో ప్రవక్తృతవము పొంది, అవతరించిన హజ్రత్ ఈసా అలైహిస్సలాం ముహమ్మదీయ సమాజ సంస్కరణ కొరకు వచ్చెదరని అందురు. వారు ప్రవక్తగా వత్తురు. వారు రెండవ సారి ముహమ్మదీయ సమాజములో ప్రవక్తగా అవతరించినను ఖత్మె నబువ్వత్‌లో ఎలాంటి అభ్యంతరము ఏర్పడదని అందురు. ఇది వ్రతం చెడరాదు–సత్యం మానరాదు అన్నట్లున్నది.

# హజ్రత్ ముహమమద్ సల్లల్లాహు అలైహి వసల్లం మహిళా అనుచరుల సాటిలేని త్యాగాలు..

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ

أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔ بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అస్సలాము అలైకుమ్ వరహ్మాతుల్లాహి వబరకాతుహు.

నేటి ఈ శుభప్రదమైన సభలో నా ఉపాన్యస శీర్షిక "హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం మహిళా అనుచరుల సాటిలేని త్యాగాలు".

అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా తెలిపెను:

**మన్ అమిల స్వాలిహన్ మ్మిన్ జకరిన్ అవ్ ఉన్సా వ హువ మూఉమినున్ ఫలనుహ్‌యియన్నహు హయాతన్ తయ్యిబతన్ వలనజ్‌జియన్నహుం అజ్‌రహుం బిఅహ్‌సని మా కానూ యఅమలూన్ (అన్నహల్:98)**

అనగా పురుషుడు గాని, స్త్రీ గాని, విశ్వాసులుగా వుండి పుణ్యమగు, సరియగు కార్యము చేసినచో అతనికిగాని, ఆమెకి గాని మేము నిశ్చయంగా (నిర్మలమైన), పరిశుద్ధమైన జీవితమును ప్రసాదింతుము. మేము (వారందరికి) వారి ఉత్తమ కర్మల ప్రకారము ప్రతిఫలమునిత్తుము.

ఇదే విధముగా ఒక హదీస్‌లో ఇలా గలదు.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఇట్లు ఉల్లేఖించారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెల్పుచుండగా నేను విన్నాను. హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు:

**నేను అనుచరుల విభేదం గురించి అల్లాహ్ తఆలాను ప్రశ్నించాను. బదులుగా అల్లాహ్ తఆలా నాకిట్లు దైవవాణి చేసెను. ఓ ముహమ్మద్! ఆకాశములో నున్న నక్షత్రాల వలె నా దృష్టిలో నీ అనుచరుల స్థాయి గలదు. కొన్ని మరి కొన్నిటికంటే ఎక్కువ ప్రకాశిస్తున్నవి. కాని కాంతి ప్రతి ఒక్కటిలో ఉన్నది. ఎవరైనా ఒకరు నీ అనుచరునిలో ఎవరినైనా అనుసరించినచో నా దృష్టిలో అతడు సన్మార్గము పొందినట్లగును. హజ్రత్ ఉమర్ (రజి) ఇంకా ఇట్లనిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు ఉపదేశించిరి. నా అనుచరులు నక్షత్రాలను పోలి ఉన్నారు. వారిలో ఎవ్వరిని మీరు అనుసరించినా సన్మార్గము పొందుదురు.**

(మిష్కాత్ కితాబుల్ మనాఖిబ్, అస్సహాబ పుట 554)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

**"ధార్మిక చరిత్రలో స్త్రీకి చాలా గొప్ప స్థానము ఉన్నదని పవిత్ర ఖుర్ఆన్ ద్వారా మనకు తెలుస్తుంది. ప్రశంసించదగ్గ స్త్రీల పనుల పట్ల అల్లాహ్ తఆలా సాక్ష్యమిచ్చాడు, ప్రస్తావించాడు. ఏ ఏ పనుల వలన పురుషులకు ప్రతిఫలము లభించునో లేదా బహుకరించబడుదురో అయా ప్రశంసించదగ్గ, ముఖ్యమైన పనుల వలన స్త్రీకి బహుమానాలు లభించునని నిర్ణయించబడెను."**

(ఖితాబ్ మస్తూరాత్ జల్స సాలానా జర్మని 2018)

ప్రియ సోదరీమణులారా! స్త్రీలమైన మనం ఈ ఆదేశాలను పాటించుటకు స్త్రీ అనుచరుల జీవిత చరిత్రలను, వారి పవిత్ర జీవిత గొప్ప త్యాగాల సంఘటనలను స్మరించుకొనుట చాలా ముఖ్యం. తద్వారా మనం ఆయా ప్రకాశిస్తున్న ఆదర్శాలను ఎప్పటికప్పుడు గుర్తు చేసుకోవచ్చును. అలాగే మన విశ్వాసాలు దృఢమగుతుండును, ఇస్లాం కొరకు మన ప్రాణం, ధనం, సమయం, సంతానంను త్యాగం చేయుటకు ఎల్లప్పుడు సిద్ధంగా వుండుటకు మనలో, మన సంతానములో ఉత్సాహం, స్ఫూర్తి, ధర్మ ప్రేమ ఏర్పడును.

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్త్రీ అనుచరుల (రజి) జీవితంను చదవడంతో ఇస్లాం కొరకు వారు సాటిలేని, ఏ మతంలో కనిపించని త్యాగాలు సమర్పించినట్లు మనకు తెలుస్తుంది. ఒక చోట ధన త్యాగ అద్భుత ఉదాహరణ కనిపించగా, మరో చోట ప్రాణాలర్పించబడుతున్నవి, ఇంకో చోట మీరు రణరంగం నుండి పారిపోయినచో ప్రళయ దినమున అస్సలు క్షమించనని తల్లులు పిల్లల కు ఉపదేశిస్తుండిరి.

ఇటువంటి అనన్య విశ్వాసభరిత దృశ్యములు గలవు. ఇస్లాం ఆకాశంలో ఈ స్త్రీ అనుచరులు ప్రకాశిస్తున్న నక్షత్రముల వలె కనిపిస్తున్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్త్రీ అనుచరుల నిరుపమాణ త్యాగాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. కొన్ని నిమిషాల ఉపన్యాసంలో వాటన్నిటిని ప్రస్తావించుట చాలా కష్టమైన పని. నేడు కొందరు స్త్రీ అనుచరుల త్యాగాలను ప్రస్తావింతును. వారు అల్లాహ్, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో విశ్వసనీయత, అభిమానం, ఆశ్చర్యకర ప్రేమానురాగాల ఉదాహార ణలను నెలకొల్పారు. ధర్మం కొరకు త్యాగాలు సమర్పించారు, ఇబ్బందులను భరించారు, రణరంగంలో వివిధ సేవలందించారు.

గౌ॥ శ్రోతలారా! అందరికంటే ముందుగా విశ్వాసుల తల్లి హజ్రత్ ఖదీజా రజియల్లాహు తఆలా అన్‌హా గురించి ప్రస్తావింతును. అన్ని రకాల త్యాగాలలో వీరు ముందుండిరి.

40 సంవత్సరాల వయసులో వీరి వివాహం మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో జరిగినది. తాత ముత్తాతలతో వారసత్వంలో పొందిన రాశిని స్వంతంగా కష్టపడి పెంచుకొనిన మొత్తం ధనాణ్ణి పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పాదాలలో ధారపోసిరి. ఎందుకనగా నా భర్త గొప్ప నమ్మకస్తుడు, పుణ్యాత్ముడని వారి (రజి) హృదయం గట్టి నమ్మకంతో సాక్ష్యమిచ్చెను. ఇదెంతో గొప్ప త్యాగముగా నిలిచెను. ఇస్లాం బలపడుటలో ఈ ధనమెంతో ముఖ్య పాత్ర పోషించెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అత్యద్భుత ఆదర్శంను తిలకించిరి. అనగా ధనం పట్ల వారికెలాంటి అత్యాశ లేకుండెను, వారు స.అ.స నిరుపేదలు, బీదలకు సానుభూతి పరులుగా నిలిచిరి. బానిసలకు స్వేచ్ఛ కల్పించడంతో మానవ హక్కులను గౌరవించు భావం వెలువడినది. ఒక మహిళ త్యాగం గొప్ప ఫలితమునందించెను. ఈ విషయంను స్వయంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బలపర్చినారు. వారి స.అ.స. ఒక వాక్యం ఇట్లు సాక్ష్యంగా నిలిచినది.

ఖదీజా తన ధనంతో నాకు కష్టకాలంలో సహకరించింది. అప్పుడు మరెవ్వరికి ఈ అనుగ్రహం లభించలేదు.

(ముస్నద్ అహ్మద్ సంపుటి 6 పుట 118)

తన భర్తను ఆరాధనలో నిమగ్నమైనట్లు చూసి ఆటంకం కలిగించక సహాయ పడుతు మనస్ఫూర్తిగా సేవలో మునిగిపోయిరి. హిరా గుహలో ఒంటరిగా ప్రార్థన చేస్తున్న కాలంలో వారు (రజి) సుమారు 55 సంవత్సరాల వయస్కురాలై ఉండవచ్చును. స్వయంగా తామే అహారం సిద్ధం చేసేవారు, ఒక్కోసారి ఎక్కువ రోజులు గడిచేవి. అలాంటప్పుడు తాను స్వయంగా ఆహారం తీసుకొని హిరా గుహ వద్దకు వెళ్లే వారు, హిరా గుహకు వెళ్లే దారి ముళ్లతో కూడినదే కాక చాలా ఎత్తులో ఉన్న విషయంను స్మరించుకొంటూ ఈ మహా గొప్ప మహిళ త్యాగాన్ని అంచనా వేయండి. ఇదెంత పెద్ద పని అనగా స్వయంగా అల్లాహ్ తఆలా కూడ ఈ విషయంను ప్రశంసిస్తు సందేశం పంపెను. హజ్రత్ జిబ్రాయీల్ (అ) వచ్చి ఇట్లు తెలిపిరి.

"ఓ దైవ ప్రవక్త! ఈ హజ్రత్ ఖదీజ (రజి) ఒక పాత్ర తీసుకొని వస్తున్నారు. ఇందులో కూరతో పాటు భుజించుటకు ఆహారం లేదా త్రాగుటకు ఏదో వస్తువున్నది. వీరు మీ వద్దకు చేరుకున్నప్పుడు అల్లాహ్ తఆలా తరపున మరియు నా తరపున సలాం చెప్పండి. స్వర్గంలో వజ్రాల భవంతి శుభవార్త అందించండి. అందులో ఎలాంటి అల్లరి, ఆందోళన లేదా అలసట కనిపించదు."

(సహీ ముస్లిం కితాబుల్ ఫజాయిల్ అస్సహాబ అధ్యాయం ఫజ్లు ఖదీజ (రజి))

మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు ప్రవక్తుత్వ పదవి లభించినప్పటికి ఇద్దరి వైవాహిక జీవితానికి 15 సం॥లు గడిచిపోయెను. ఆలోచనపరంగా ఇరువురిలో ఎంత మేరకు సమతుల్యం ఉండెనో చూడండి! ఈ దృఢ సంకల్పం గల మహిళ వారి స.అ.స.ను బలపరుస్తు పలికిన వాక్యం వారి స.అ.స. ఉత్తమ ఆదర్శంనకు సాక్ష్యంగా నిలిచెను. వారు (రజి) ఇట్లనిరి. "అల్లాహ్ తఆలా మిమ్ములనెన్నడు అవమానపర్చడు. ఎందుకనగా మీరు స.అ.స. బంధువులతో మంచిగా వ్యవహరిస్తారు, సత్యమే పలుకుతారు, మీరు స.అ.స. ప్రజల భారాలను మోస్తారు, అతిథి మర్యాదలు చేస్తారు, ఆపదలలో ప్రజలకు సహకరిస్తారు. ఇటువంటి గొప్ప సద్గుణములు కలిగిన వ్యక్తికి ప్రమాదమెలా సంభవించును."

(బుఖారి కితాబ్ బదఉల్ వహీ)

ఇస్లాంకు ఇస్లాం వ్యవస్థాపకునికి ఎంత వ్యతిరేకత ఎదురైనదో వారు (రజి) చూశారు. నబ్వీ ఏడవ సం॥లో ఇస్లాంను అంతమొందించుటకు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం), వారి స.అ.స. వంశంను అబీ తాలిబ్ ఘాటిలో నిర్బంధించాలని ఖురైష్‌లు కుట్ర పన్నారు. నిర్బంధించిన వారిలో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో పాటు హజ్రత్ ఖదీజ (రజి) కూడ పాల్గొనిరి. మూడు సం॥ల వరకు కొనసాగిన ఈ కాలము వరుసగా త్యాగాలతో గడిచినది. ఆకాశ నీడన ఆకలి, దాహం, వాతావరణ కఠినత్వములతో పాటు పిల్లలతో దూరముంటూ చాలా బాధలను భరించారు. కాని దైవ ప్రవక్త స.అ.స.ను ఒంటరిగా వదల్లేదు. వరుసగా ఉన్న ఆకలి తన ప్రభావం చూపెను, ఈ కఠిన రోజుల బాధలను తాళలేక వారి స.అ.స. విశ్వసనీయురాలైన సతీమణి పరమపదించిరి. **(ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్)** విశ్వాసుల తల్లి అయిన హజ్రత్ ఖదీజ (రజి) మరణ బాధను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవితాంతం మరచిపోలేక పోయారు. వారు (రజి) ఎంతో అదృష్టవంతురాలైన మహిళ. ఎందుకనగా వారి (రజి) గురించి

వారు స.అ.స. ఇట్లు వెల్లడించారు.

"ఖదీజా (రజి) కంటే మెరుగైన వారెవరు లేరు. ప్రపంచం మొత్తం నన్ను నిరాకరిస్తున్నప్పుడు ఆమె నన్ను విశ్వసించినది. ప్రపంచం మొత్తం నన్ను అసత్యుడని తిరస్కరిస్తున్నప్పుడు ఆమె నన్ను బలపర్చినది. నన్ను అందరు వదలిపెట్టినప్పుడు ఆమె తన ధనంతో నాకు మేలు కలిగించి, నాకు సహకరించెను. ఓ ఆయిశా! ఖదీజా (రజి) ప్రేమ నాకు త్రాగించబడినది, నా హృదయములో నాటబడినది." (ముస్లిం కితాబుల్ ఫజాయిల్ అధ్యాయం ఫజ్ల ఖదీజా (రజి))

గౌ॥ మౌలానా దోస్త్ ముహమ్మద్ షాహిద్ గారి పదాలలో నేను వారికి జోహార్లు పలుకుతున్నాను. వారిట్లు తెలిపిరి.

"విశ్వాసుల తల్లి అయిన **హజ్రత్ ఖదీజా (రజి)** నేడు ఈ ప్రపంచంలో లేరు. వారి సమాధి ఆనవాళ్లు కూడ అదృశ్యమైనవి. కాని వారి పని, పేరు రెండు శాశ్వతంగా బ్రతికే ఉన్నాయి. ఇదే విధంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పవిత్ర నోటితో వెలువడిన ప్రశంసనీయ వాక్యములు కూడ ఈ ఆకాశ గాలి నుండి ఎన్నడు అదృశ్యం కాలేవు. నిశ్చయంగా అవి ప్రతి ప్రవక్త ప్రేమికుని హృదయం, మనసులో సురక్షితంగా ఉన్నాయి, ప్రళయ దినం వరకు దద్దరిల్లుతూనే ఉండును. వైభవ, పవిత్ర ఆస్థానంను అధిష్టించిన సజీవ ప్రవక్త, ప్రవక్తల చక్రవర్తి ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ప్రథమ సతీమణిగా హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా నిశ్చయంగా రెండు లోకాలకు రాణిగా ఉన్నారు.

ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం దేవుని ప్రమాణంగా! ప్రపంచంలోని ఏ పెద్ద శక్తి వారి ఈ ఆధ్యాత్మిక కిరీటంను వశపర్చుకోలేదు. వారి (రజి) ఆకాశ చక్రవిర్తత్వం సైతం ఎన్నడు క్షీణించదు. **అల్లాహుమ్మా సల్లిఅలా సయ్యిదినా వ మౌలానా ముహమ్మదిన్ వ అలా అజ్వాజి ముహమ్మదిన్ వ బారిక్ వసల్లిమ్ ఇన్నక హమీదు మ్మజీద్.**

మరో ప్రస్తావన మహ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రియాతిప్రియమైన సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) గారిది. అల్లాహ్ తఆలా హజ్రత్ ఆయిశా (రజి) చిత్రమును పట్టు దస్తిలో పెట్టి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు చూపించెను. దాదాపు 9 సంవత్సరాలు మాత్రమే హజ్రత్ అయిశా (రజి) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెంట గడిపారు. ఈ కొద్ది సంవత్సరాలలోని ప్రతి క్షణం వారి స.అ.స.తో ధర్మం నేర్చుకొనుటకు, వారి స.అ.స. కదలికలను ఎంతో శ్రద్ధతో గమనించుటలో గడిపారు. ఎంత వరకు ధర్మం నేర్చుకున్నారనగా గొప్ప విద్యావంతులైన అనుచరులలో వారు (రజి) పరిగణించబడుతారు.

జామి తిర్మిజిలో హజ్రత్ అబూమూసా అష్అరి (రజి) ఇట్లు ఉల్లేఖించారు. మాకు ఎదురైన ప్రతి సమస్య గురించి మేము అడిగినప్పుడు దాని గురించి కొంత సమాచారము మాకు హజ్రత్ ఆయిశా (రజి) వద్ద తప్పక లభించినది. హజ్రత్ ఆయిశా (రజి) పిన్న వయసులోనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వైవాహిక జీవితంలో అడుగుపెట్టారు. అయినను మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు పూర్తిగా సహకరించారు. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పూర్తిగా పవిత్ర జీవితం గడిపేవారు. కొన్ని రోజుల వరకు ఇంట్లో పొయ్యి వెలిగేది కాదు. ఇల్లు మట్టితో నిర్మించబడెను. హజ్రత్ ఆయిశా (రజి) ఇంటి పనులన్ని చేసేవారు. పిండి కొరకు ఇసుర్రాయితో విసిరేవారు, పిండి మొత్తగా చేసేవారు, భోజనం వండే వారు, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరుపు ఎల్లప్పుడు తన చేతితో శుభ్రం చేసి పరిచేవారు, తలాపున నీళ్లు, పండ్లపుల్ల పెట్టేవారు, వారు (రజి) ఇట్లు తెలిపేవారు. భార్యలమైన మాలోని ప్రతి ఒక్కరి వద్ద ఒక్క జత బట్టలు తప్ప ఎక్కువ బట్టలుండేది కాదు. వారు (రజి) యుద్ధాలలో కూడ మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెంట పాల్గొనేవారు, యుద్ధంలో క్షతగాత్రులకు నీళ్లు త్రాపించేవారు.

విజయాల పరంపర మొదలైనప్పుడు శత్రువుల సామాగ్రి చాలా రావడం మొదలైనది. కావున పవిత్ర సతీమణీలు కూడ ఎక్కువ ఖర్చు లభించాలని అడిగినారు. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మొట్టమొదటగా హజ్రత్ ఆయిశా (రజి) వద్దకు వచ్చి అల్అహ్జాబ్ సూక్తులు 29,30 లలో గల అల్లాహ్ తఆలా ఆదేశంను వినిపించారు. వాటి అనువాదమిట్లు గలదు.

ఓ సందేశహరుడా! నీవు నీ భార్యలతో ఇట్లనుము "మీరు ప్రపంచము, దాని అలంకరణ సామాగ్రి కోరినచో నేను మీకు కొంత ప్రాపంచిక సామాగ్రిని ఇత్తును రండి. మిమ్ములను సన్మార్గములో సెలవిత్తును. మీరు అల్లాహ్‌ను, అతని ప్రవక్తను, పరలోక జీవిత గృహమును కోరినచో అల్లాహ్ మీలో నుండి సంపూర్ణముగా ఇస్లాంపై స్థిరపడిన వారి కొరకు చాలా గొప్ప బహుమతిని నిర్ణయించి వున్నాడు. వారు స.అ.స. ఇట్లనిరి. దీనికి సమాధానం కోరుతున్నాను.

గౌ॥ శ్రోతలారా! నిస్సందేహంగా తాత్కాలికంగా శత్రువుల సామాగ్రి చాలా ఎక్కువగానే వస్తుండదాన్ని చూసి పవిత్ర సతీమణీలు ఖర్చు ఎక్కువ ఇవ్వాలని తమ కోరికను వెల్లడించారు. కాని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అసంతృప్తిని ఎవరు భరించగలరు? హజ్రత్ ఆయిశా (రజి) తక్షణమే ఇట్లు సమాధానమిచ్చిరి. ఓ నా యజమాని? నేను అల్లాహ్, అతని ప్రవక్త మరియు పరలోకంను ఆశిస్తున్నాను. మిగతా సతీమణీలు కూడ ఇలాగే సమాధానమిచ్చారు. తద్వారా ప్రపంచంలోని ముస్లిం మహిళలందరి కొరకు వారు ఆదర్శంగా నిలిచారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించినప్పుడు హజ్రత్ ఆయిశా (రజి) వయసు కేవలం 20 సం॥లుండెను. వారెంతో సహనం, ఓర్పు, స్థిరత్వంను ప్రదర్శించారు. వారి (రజి) గది మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సమాధిగా మారినది. అనంతరం హజ్రత్ అబూబక్ర్ (రజి) కూడ ఇదే గదిలో సమాధి చేయబడిరి. హజ్రత్ ఆయిశా (రజి) మనోభావాలతో కూడిన ఒక మహా గొప్ప త్యాగం గలదు. వారు (రజి) తమ గదిలోని మిగతా స్థలంను తన కొరకు కేటాయించుకొనిరి. కాని హజ్రత్ ఉమర్ (రజి) తన కుమారుణ్ణి హజ్రత్ ఆయిశా (రజి) వద్దకు పంపి ఆ గదిలో తనను సమాధి చేయాలనే అనుమతి కోరిరి. అప్పుడు హజ్రత్ ఆయిశా (రజి) ఇట్లు బదులిచ్చిరి. ఈ స్థలంను నేను నా కొరకు పెట్టుకొని ఉంటిని. కాని నేడు నేను నా కంటే ఉమర్‌కు అధిక ప్రాధాన్యతనిస్తున్నాను. తన ప్రియమైన భర్త, మహానుడైన తన తండ్రి ప్రక్కన సమాధి అయ్యే తన కోరికను త్యాగం చేసి ఖలీఫా కోరికను పూర్తి చేసిరి.

గౌ॥ శ్రోతలారా! **హజ్రత్ ఉమ్మె సల్మా (రజి)** పరిస్థితిని చూడండి. వారు (రజి) చాలా గారాలతో పోషించబడిరి. ఇస్లాం స్వీకరించిన తర్వాత తన భర్తతో కలిసి ఎబిసీనియా వైపు వలస వెళ్లిరి. వారి భర్త అబూ సల్మా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఒకే తల్లి పాలు త్రాగినందున సోదరులుగా ఉండిరి. వలస వెళ్లిన మొదటి మహిళ వీరే. ఎబిసీనియా నుండి తిరిగి వచ్చిన తర్వాత మదీనాకు వలస వెళ్లదలచిరి. ఎందుకనగా మక్కా వాతావరణం గతం కంటే ఎక్కువ రక్తపాతంగా మారి పోయెను. వలస వెళ్తున్నప్పుడు వారి తెగ ప్రజలు అడ్డుకొని, వారిని పోనివ్వలేదు. తుదకు అబూ సల్మా (రజి) ఒంటరిగా వెళ్లిపోయిరి. వారు వెళ్లిపోయిన తర్వాత వారి అత్తగారు వచ్చి వారి అమాయక అమ్మాయి సల్మాను మా పిల్ల అని గుంజుకొని పోయిరి. ఉమ్మె సల్మాకు చాలా బాధ కలిగింది. కావున ఆమె ప్రతి రోజు ఆందోళన చెంది బయటి మైదానాలలో తిరిగే వారు. పొద్దంతా ఏడ్చేవారు. ఒక సంవత్సరం వరకు ఇదే పరిస్థితి కొనసాగినది. చివరికి వారి చిన్నాన వరుస సోదరునికి దయ కలిగింది. అతడిట్లనెను. ఓ దైవ దాసులారా! ఈ అసహాయ పేద మిహళను మీరెందుకు విడిచి పెట్టుతలేరు? అప్పుడు వారికి కొంత దయ కలిగింది. తన భర్త వద్దకు వెళ్లిపోవుటకు వారు ఆమెకు అనుమతిచ్చారు. అప్పుడు అత్తగారికి కూడ కొంత దయ కలిగి అమ్మాయిని తిరిగి ఇచ్చి వేశారు. కావున వారు మదీనాకు చేరుకున్నారు. వారి భర్త అబూ సల్మా (రజి) చాలా మంచి అశ్వరోహణులు. ఉహద్ యుద్ధంలో తగిలిన గాయాలతో కోలుకోలేక పోయారు. కొంత కాలం తర్వాత వారి గాయం అధికమై వారు మృతి చెందారు. మృతి చెందిన విషయాన్ని విని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి గృహానికి వచ్చిరి. చాలా హృదయ విదారక దృశ్యమెండెను. ఉమ్మె సల్మా (రజి) ఇట్లు రోధిస్తుండిరి. మాతృ భూమి బయట ఇదెలాంటి మరణం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సహనం పాటించాలని ఆదేశించిరి. దుఆ చేయుము. అల్లాహ్ వీరి కంటే మెరుగైన ఉత్తరాధికారిని ప్రసాదించుగాక! మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అబూ సల్మా (రజి) అంత్యక్రియ ప్రార్థనలో 9 తక్బీర్లు పలికినారు. ప్రజలు ప్రశ్నించగా వీరు వెయ్యి తక్బీర్లలకు అర్హులని సమాధానమిచ్చారు. అప్పుడు ఉమ్మె సల్మా (రజి) గర్భవతిగా ఉండిరి. కానుపు అయిన తర్వాత నిర్ణీత వ్యవధి గడిచిపోయినప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వివాహ సందేశం పంపిరి. ఉమ్మె సల్మా (రజి) సాకులు చెబుతు నేను చాలా స్వాభిమానురాలిని, పిల్లలు గల దానిని, వయసు కూడ ఎక్కువున్నదని సమాధానమిచ్చిరి. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అన్ని సాకుల గురించి సంతృప్తి పరచినారు. అనంతరం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో వారి వివాహం జరిగినది.

**హజ్రత్ సుమియ్య (రజి)** మొట్టమొదటి అమరులైన ముస్లిం మహిళ. ఇస్లాం స్వీకరించుటలో వారి స్థానం ఏడవది. వారిని అన్యారాధకురాలిగా మార్చాలని అన్యారాధకులు అన్ని రకాలుగా కృషి చేశారు. మక్కాలోని మండుతున్న ఇసుకపై ఇనుప వస్త్రం తొడిగించి మండుటెండల్లో ఆకలి, దాహంతో పొద్దంతా నిలబట్టేవారు. స్థిరత్వంకు మారుపేరైన వీరి ముందు వారి ప్రతి ప్రయత్నం విఫలమైనది. ఒకనాడు రాత్రి పూట అబూజహల్ వారిని దూషించడం మొదలు పెట్టెను. అనంతరం అతనికి ఎంత కోపం వచ్చిందనగా ఆమెపై బర్ఛీతో దాడి చేయగా ఆమె అమరులైనారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్.

**హజ్రత్ ఉమ్మె అమ్మారహ్ (రజి)** బనూ నజ్జార్ తెగస్తురాలు. మదీనాలో జన్మించిరి. హిజ్రి మూడవ సంవత్సరంలో అవిశ్వాసుల సైన్యం వస్తుందనే వార్త విని యుద్ధ సన్నాహాలు చేసుకోసాగిరి. హజ్రత్ ఉమ్మె అమ్మారహ్ (రజి) క్షతగాత్రులకు పట్టీలతో చికిత్స, నీళ్లు త్రాగించడం అనే మనవితో యుద్ధంలో పాల్గొనుటకు అనుమతి కోరిరి. అది ఆమోదించబడెను. వారు (రజి) తమ భర్త, ఇద్దరు కుమారులతో కలిసి యుద్ధంలో పాల్గొన్నారు. క్షతగాత్రులకు నీళ్లు త్రాగిస్తుండగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రమాదంలో ఉన్నారని తెలుసుకొని నీళ్ల సంచిని పారవేసి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సమీపానికి చేరుకొని రక్షణ చేయడం మొదలు పట్టారు. అవిశ్వాసులు వారి స.అ.స.కు నష్టం కలిగించేందుకు చాలా తీవ్రంగా ఒక దాని వెనుక మరో దాడి చేస్తుండిరి. వారి స.అ.స. చుట్టు చాలా తక్కువ మంది మిగిలి పోయిరి. ఆ కొద్ది మంది వారి స.అ.స. రక్షణ కొరకు తమ ప్రాణాలను ఫణంగా

పెట్టిరి. ఇటువంటి సున్నిత, ప్రమాదకర సందర్భంన ఈ ధైర్యశాలి అయిన స్త్రీ వారి స.అ.స. కొరకు రక్షణగా నిలిచిరి. అవిశ్వాసులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై దాడులు చేసినప్పుడు వారు (రజి) బాణాలను, ఖడ్గంను ఆపేవారు. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వయంగా ఇట్లు తెలిపారు. నాకు కుడి ఎడమ వైపు వరుసగా యుద్ధం చేస్తున్నట్లు నేను ఉమ్మె అమ్మారహ్‌ను చూశాను. ఇబ్నె ఖయ్యిమ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అతి సమీపమునకు చేరుకున్నప్పుడు ఇదే వీర వనిత అతణ్ణి అడ్డుకొనెను. ఈ దుష్టుడు ఎంత గట్టిగా దాడి చేశాడనగా ఈ వీర వనిత భుజానికి గాయమయ్యెను. అక్కడ ఎంత గాయమైనదనగా ఒక రంధ్రం పడెను. కాని తన అడుగులను వెనక్కి వేయలేదు. ఆమె ఎంతో ధైర్యంతో ముందుకు వెళ్లి అతనిపై చాలా తీవ్రమైన దాడి చేయగా అతడు రెండు రక్షణ కవచంలు ధరించనిచో హతమయ్యేవాడే.

గౌ॥ శ్రోతలారా! ఇప్పుడు **హజ్రత్ అబూబక్‌ర్ కుమార్తె అస్మా** వివరాలు వినండి. విశ్వాసము ప్రకటించిన వారిలో వారు 18వ విశ్వాసురాలు. వారి కథనము ఎట్లున్నదనగా వారి కుమారుడు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) అమరుడైనప్పుడు హజ్జాజ్ వారి భౌతికకాయాన్ని శిలువపై వ్రేలాడదీసెను. మూడు రోజులు గడిచిన తర్వాత హజ్రత్ అస్మా (రజి) తమ బానిసరాలితో భౌతికకాయం వద్దకు వచ్చిరి. భౌతికకాయం ఉల్టా వ్రాలేడుతుండెను. ధైర్యం కూడగట్టుకొని ఈ దృశ్యాన్ని చూశారు. అనంతరం ఎంతో స్థిరత్వంతో ఇట్లన్నారు.

"ఈ అశ్వరోహణుడు అశ్వం దిగే సమయం ఇంకా రాలేదా" కొన్ని రోజుల తర్వాత అబ్దుల్ మలిక్ ఆదేశం రావడంతో హజ్జాజ్ ఆ భౌతికకాయాన్ని దించి యూదుల శ్మశానవాటికలో పడవేయించెను. హజ్రత్ అస్మా (రజి) ఆ భౌతికకాయాన్ని తమ ఇంటికి తెప్పించి స్నానం చేయించి అంత్యక్రియ ప్రార్థన చదివిరి. హజ్రత్ ఇబ్నె జుబైర్ ఒక్కొక్క అంగం విడి పోయెను. స్నానం చేయించడానికి ఒక అంగంను పట్టుకున్నచో అది విడిపోయి వచ్చేది. కాని హజ్రత్ అస్మా (రజి) ఈ దృశ్యాన్ని చూసి ఈ విడి విడి అవయవాలపైనే దైవ కరుణ అవతరించిందని ఓర్పు వహించిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ శవాన్ని చూడనంత వరకు నాకు మరణం సంభవించకూడదని హజ్రత్ అస్మా (రజి) దుఆ చేసేవారు. అనంతరం ఒక వారం గడవక ముందే హజ్రత్ అస్మా (రజి) మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. అప్పుడు వారి వయసు 100 సంవత్సరాలుండెను.

**హజ్రత్ ఉమ్మె అబ్బాన్ (రజి)** తమ భర్త ఆయుధాలను ధరించి రణ రంగంలో దూకినారు. ముస్లింలతో కలిసి రోములపై బాణాల వర్షం కురిపించిరి. దమిష్క్ పాలకుడు ఏ విధంగాను వెనుకకు కదులుటకు సిద్ధంగా లేకుండెను. వారు బాణాలు విసురుటలో నిపుణురాలై ఉండిరి. ఆమె ఎంతో చక్కగా గమనిస్తూ అవకాశం చూసుకొని అతని కంట్లో బాణం విసిరిరి. కావున దీని తర్వాత రోములు పారిపోవడం మొదలు పెట్టారు.

**హజ్రత్ ఖన్సా (రజి)** వృద్దాప్యంలో ఇస్లాం స్వీకరించారు. వారు (రజి) పద్యాలు వ్రాయడంలో తిరుగు లేని వారు. ఖాదసియ యుద్ధంలో తమ నలుగురు కుమారులను తీసుకొని రణ రంగంలో ప్రవేశించారు. వారినుద్దేశించిలామె ఇట్లు ఉపదేశించారు. ప్రియ కుమారులారా! మీరు ఇస్లాంను, వలసను తమ ఇష్టంతో అవలంబించారు. లేనిచో మీరు మీ మాతృదేశానికి భారంగా లేకుండిరి. లేక అక్కడ కరువు కూడ లేకుండెను. పైగా మీరు మీ వృద్ధ తల్లిని ఇక్కడికి తీసుకొచ్చి పారసీకుల ముందుకు తెచ్చారు. అల్లాహ్ ప్రమాణముగా! మీరు ఒక తల్లిదండ్రుల కుమారులు. నేను మీ తండ్రిని మోసం చేయలేదు. లేదా మీ మామలను అవమానపర్చలేదు. ఇహలోకం అంతమగుతుందని, అవిశ్వాసులతో యుద్ధం చేయుటలో పుణ్యముందని మీకు తెలుసు. అల్లాహ్ తఆలా ఇట్లు ఆదేశించెను. **యా అయ్యుహల్లజీన ఆమనూ స్బిరూ వ సాబిరూ వ రాబితూ** (ఆలె ఇమ్రాన్:201) అనగా ఓ విశ్వాసులారా! సహనము వహింపుము, శాంతచిత్తులై ప్రవర్తింపుము నిగ్రహముతో మర్యాదను కాపాడుకొనుము. సరిహద్దులను కాపాడుము. మీరు సౌభాగ్య వంతులగుటకు ధర్మబద్ధులై ప్రవర్తించుము. కావున ఉదయం లేచి యుద్ధానికి సన్నాహాలు చేసుకోండి. చివరి వరకు యుద్ధం చేయండి. అనంతరం నలుగురు కుమారులు ఏకకాలంలో ఆయుధాలు ధరించి, ఎంతో ఉద్రేకం, ఉత్సాహంతో సవాలు విసురు పద్యాలు చదువుతు అవిశ్వాసులపై దాడులు చేసిరి. హజ్రత్ ఖన్సా (రజి) కుమారులను పంపించిన తర్వాత అడవిలో ప్రవేశించి దుఆలు చేయడం మొదలు పెట్టిరి. అల్లాహ్ తఆలా కరుణించినందున ముస్లింలు విజయం సాధించిరి, ఆ స్త్రీ అనుచరుని నలుగురు కుమారులు కూడ సజీవంగా తిరిగి వచ్చిరి.

గౌ॥ శ్రోతలారా! **హజ్రత్ ఉమ్మె షరీక్ దౌసియ (రజి)** విశ్వాసం ప్రకటించి నప్పుడు వారి బంధు మిత్రులు వారిని బాధలకు గురి చేయడం మొదలు పెట్టిరి. ఇందుకు వారు ఆలోచించిన పద్ధతి ఏమనగా వారిని ఎండలో నిలబట్టేవారు. ఈ తీవ్ర ఎండలో ఆమెకు తేనె లాంటి వేడి వస్తు తినిపించేవారు కాని ఒక్క చుక్క నీళు మాత్రం ఇచ్చేవారు కాదు. ఈ విషయములన్నిటి వలన ఆమె స్పృహ కోల్పోయేవారు. ఇటువంటి పరిస్థితిలో ఇస్లాంను విడిచి పెట్టండని ఆమెతో అనేవారు. కాని ఆమెకు ఏమియును అర్థం కాలేకపోయేది. అర్థం చేయించుటకు ఆకాశం వైపు సంజ్ఞ చేసేవారు. దైవ ఏకత్వంను నిరాకరించాలని చెప్తున్నారని అర్థం చేసుకొనేవారు. ఇలా ఎన్నటికి జరగదని ఆమె (రజి) చెప్పేవారు.

**హజ్రత్ సఫ్యా బిన్తె అబ్దుల్ ముత్తలిబ్ (రజి)** పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పుప్పమ్మ. వీరి వయసు సుమారు వారి స.అ.స. వయసుకు సమానంగా ఉండెను. చాలా ధైర్యం, సాహసం గల మహిళగా ఉండిరి. అధిక యుద్ధాలలో పాల్గొన్నారు. క్షతగాత్రులకు చికిత్స పట్టీలు చేసేవారు, నీళ్లు త్రాగించేవారు, స్త్రీలు నీళ్ల త్రాగించుట అప్పటి ఆచారముండెను. కాని అవసరమొచ్చినప్పుడు ఖడ్గం పట్టుకొనేవారు. ఉహద్ యుద్ధంలో విజయం ఓటమిగా మారిపోయెను. ముస్లింలు చెల్లా చెదురైరి. వారి స.అ.స. చుట్టు రక్షణ వలయంగా మారిరి.

ఈమె గొప్ప సాహసంపై దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు చాలా ఆశ్చర్యం కలిగెను.. వారు స.అ.స. వారి కుమారుడు జుబైర్ (రజి)తో ఇట్లనిరి. ఓ జుబైర్! తమ తల్లి మరియు నా పుప్పమ్మ ధైర్యం చూడుము! పెద్ద పెద్ద వీరులు పారిపోయారు. కాని ఈమె అవిశ్వాసుల మధ్యలో పర్వత రూపంలో నిలిస్తు వీరోచితంగా ఒంటరిగా పోరాడుతున్నారు.

ఇదే విధంగా ఉహద్ యుద్ధంలో హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం చిన్నాన అమరుల నాయకులు హజ్రత్ హంజ (రజి) అమరులైరి. అవిశ్వాసులు వారి చెవులు, ముక్కు కోసి వేసి, కండ్లు పీకేసి, కాలేయం చీల్చి బయటికి తీసిరి. అప్పుడు నా పుప్పమ్మ సఫ్యా (రజి)ను నా చిన్నాన్న శవం వద్దకు రానివ్వకని జుబైర్‌కు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిరి. లేనిచో ఆమె తన సోదరుడి ఈ స్థితిని చూసి చాలా దుఃఖానికి లోనవుతారు. అయినను సఫ్యా (రజి) శవం వద్దకు చేరుకొని హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంతో అనుమతి తీసుకొని శవంను చూసి **ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్** చదివి ఇట్లనిరి. దైవ మార్గంలో నేను దీనిని ఏదో పెద్ద త్యాగమని భావించను. అనంతరం క్షమాపణ కొరకు దుఆ చేస్తూ అక్కడి నుండి వెళ్లిపోయిరి.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్ సంపుటి 1 పుట 452)

అహ్‌జాబ్ యుద్ధం సందర్భమున ఆమె (రజి) వయసు సుమారు 58 సం॥లుండెను. కాని సాహసం యవ్వనంగా ఉండెను. వీరత్వంను ప్రదర్శించిరి. యుద్ధం సందర్భంన మహిళలు, పిల్లలను రక్షణ ఉద్దేశంతో ఒక కోటలో చేర్చబడెను. కావున ఆమె (రజి) అదే కోటలో పెట్టబడిరి. యూదుల ఒక గూఢచారి కోట గురించి విషయాలు తెలుసుకుంటున్నాడని ఆమె చూసి, ప్రమాదాన్ని పసిగట్టి ఇతన్ని ఇక్కడి నుండి పోనివ్వకూడదని భావించిరి. కనుక ఆమె గుడారపు ఒక కర్ర తీసుకొని ఎంతో గట్టిగా అతని తలపై కొట్టిరి. తద్వారా అతని తల పగిలి అక్కడికక్కడే మరణించెను. అతని ఖడ్గంతోనే అతని తల నరికి కోట బయట విసిరి వేసిరి. కోటలో కూడ సైన్యముందని భావించి యూదులు వెనక్కి పారిపోయిరి. ఇలా ఒక మహిళ సాహసం వలన ముస్లింలు ఒక భారీ నష్టం నుండి తప్పించుకొనిరి.

**హజ్రత్ సుమయ్యా బిన్తె ఖబాత్-ఉమ్మె అమ్మారహ్ (రజి).** అమ్మార్ (రజి) మరియు వారి తండ్రి యాసిర్ (రజి) మరియు వారి తల్లి సుమయ్య (రజి)ను బనీ మక్జూమ్ ఎంతగా ఇబ్బందులకు గురి చేసేవారనగా వాటిని చదివితేనే శరీరం కంపిస్తుంది. ఒకసారి ఈ ఇస్లాం అభిమానులు శారీరక హింసకు గురవుతుండగా అనుకోకుండా అక్కడి నుండి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్లిరి. వారు (రజి) వారి వైపు ఎంతో దుఃఖ భరిత స్వరంతో ఇట్లనిరి. **సబ్‌రన్ ఆల యాసిర్ ఫ ఇన్న మౌఇదకుముల్ జన్నత** అనగా ఓ యాసిర్ కుటుంబీకులారా! ఓర్పును వీడకండి! మీకు కలుగుతున్న ఈ ఇబ్బందుల వల్లనే అల్లాహ్ తఆలా మీ కొరకు స్వర్గంను సిద్ధం చేసి ఉంచాడు. తుదకు యాసిర్ ఇదే బాధాకర స్థితిలో అమరులైనారు. వృద్ధురాలు సుమయ్య తొడపై క్రూరుడు అబూజహల్ క్రూరంగా బర్ఛీతో దాడి చేయగా అది వారి శరీరంను చీల్చుతు ఆమె శీలం వరకు వెళ్లినది. తద్వారా ఈ అమాయక మహిళ విలవిలలాడుతు ఘటనాస్థలంలోనే మృతి చెందిరి.

చివర్లో హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కుమార్తె **హజ్రత్ ఫాతిమా (రజి)** గురించి ప్రస్తావించెదను. ప్రపంచంలోనే అల్లాహ్ తఆలా దృష్టిలో పుణ్యాత్మురాలిగా నిర్ణయించబడిన మహిళల్లో హజ్రత్ ఫాతిమా (రజి)ను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరిగణించిరి. ఈ విషయం తిర్మిజీలో ప్రస్తావించబడెను. అనగా మీరు అనుసరించుటకు ప్రపంచంలోని మహిళలందరిలో మర్యమ్, ఖదీజా, ఫాతిమా మరియు ఆసియా సరిపోవుదురు.

హజ్రత్ ఫాతిమా (రజి) మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కనిష్ట కుమార్తె. వారి (రజి) స్థాయి గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి.

ఫాతిమా ప్రీతితో అల్లాహ్ తఆలా ప్రీతి లభించును. ఆమె ఆగ్రహంతో అల్లాహ్ తఆలా ఆగ్రహానికి గురగును....ఈ సమాజ స్త్రీలు, మొత్తం లోకాల స్త్రీలు, స్వర్గంలో ప్రవేశించు స్త్రీలు, విశ్వాసం ప్రకటించే స్త్రీలకు ఫాతిమా నాయకురాలు.

(అజ్వాజె ముతహ్హిరాత్ వ సహాబియాత్ పుట 292-293)

ఇంకా ఇట్లనిరి. "ఫాతిమా నా శరీర భాగం. ఆమెకు బాధ కలిగించిన వాడు నాకు బాధ కలిగించిన వాడగును."

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: mdakbar1451@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2023-2025, Vol. 9 Thursday, 25 JUL 2024 Issue No 30

MANAGER
SHAIKH MUJAHID AHMAD
Mobile. : +91 99153 79255
e-mail:managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

(తజ్కార్ సహాబియాత్ పుట 143)

వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రియాతి ప్రియమైన సంతానము. కాని వారు స.అ.స. తమ ఈ ప్రియమైన కుమార్తెకు కట్న కానులలో ఇచ్చిన వస్తువులు ఇట్లు గలవు. బాన్ కట్టె మంచం, చర్మంతో చేసిన పరుపు. ఇందులో దూది బదులు ఖర్జూరపు ఆకులుండెను, ఒక నీళ్ల సురాయి, రెండు మట్టి కుండలు, ఒక కస్తూరి, రెండు ఇసుర్రాయిలు. అప్పటికే వసతుల కాలం వచ్చెను. అయినను దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తమ ప్రియమైన కుమార్తెను ప్రాపంచిక ఐశ్వర్యంను ఆశించకుండా ఉంచుటకు ఎలా శిక్షణ ఇచ్చి ఉండిరనగా ఆమె (రజి) ఇంటి పనులన్ని స్వయంగా చేసుకునేవారు. ఇసుర్రాయి విసురుతు విసురుతు చేతులకు పొక్కులు పడేవి. నీళ్లు మోసుకొస్తు మోసుకొస్తు భుజాలపై కాయలు పడెను. ఒకసారి హజ్రత్ ఫాతిమా (రజి) ఇంటి పనుల కొరకు ఒక పనిమనిషి అమ్మాయిని అడగడానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్లి మనవి చేసిరి. ఆమెకు పని మనిషి ఇచ్చే బదులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రతి నమాజ్ తర్వాత తస్బీహ్, తహ్మీద్ చదవాలని సూచించిరి. కావున ఆమె (రజి) దీనిని పాటించడం మొదలు పెట్టిరి.

ఒక సారి ఒక దుష్టుడు వారి స.అ.స. తలపై మట్టి వేసెను. పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇంటికి వచ్చిరి. వారి స.అ.స. ప్రియమైన కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి) మట్టితో నిండి ఉన్న తలను కడుగుతు రోధిస్తుండిరి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆమెను సంతృప్తి పరుస్తు ఇట్లనిరి. బిడ్డా! ఏడ్వకుము! నీ తండ్రికి అల్లాహ్ తఆలా రక్షకునిగా ఉన్నాడు.

(అహ్లె బైత్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పుట 277–278)

గౌ॥ శ్రోతలారా! హజ్రత్ ఫాతిమా (రజి) యుద్ధాలలో కూడ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొని వారి స.అ.స.కు సేవ చేయు అనుగ్రహం పొందిరి. హజ్రత్ ఫాతిమా (రజి)కు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో చాలా ప్రేమ ఉండెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తర్వాత హజ్రత్ ఫాతిమా (రజి) ఎన్నడు హాస్యించలేదు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పరమపదించిన ఆరు నెలల తర్వాత హజ్రత్ ఫాతిమా (రజి) కూడ మృతి చెందిరి. అప్పుడు ఆమె (రజి) వయసు కేవలం 29 సం॥లు మాత్రమే ఉండెను.

గౌ॥శ్రోతలారా! ఈ ప్రియమైన మహిళా అనుచరుల సద్గుణముల ప్రస్తావన చేస్తూ పోవాలనే అనిపిస్తుంది. మనము ఈ స్త్రీ అనచరుల ప్రస్తావన వలన తాత్కాలిక మార్పు మాత్రమే మనలో భావించక మన జజీవితాలలో నిజంగానే ఆయా స్త్రీ అనుచరుల అడుగు జాడలలో నడుచుటకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక!

స్త్రీ అనుచరులను ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని (రజి) స్త్రీలను ఇట్లు ఉపదేశంచిరి.

“మీరు మీ స్థాయిని గుర్తించండి. తమలో నూతన చైతన్యం, క్రొత్త జీవితంను కలిగించుకొనుటకు ప్రయత్నించండి. మీ అభివృద్ధి కొరకు అల్లాహ్ తఆలా అనేక అవకాశాలను కల్పించెనని మీకు తెలియ వలెను. మీరు కూడ హజ్రత్ అయిశా (రజి)ను అనుసరించండి, మీరు కూడ హజ్రత్ హఫ్స (రజి)ను ఆదర్శంగా తీసుకోండి, మీరు కూడ హజ్రత్ జైనబ్ (రజి)ను అనుసరించండి, తమ కాలంలో ఘనకార్యాలు చేసి చూపించిన స్త్రీ అనుచరులను మీరు ఆదర్శంగా తీసుకోండి.”

1997 జర్మనీ ఉపన్యాసంలో పవిత్ర సతీమణీల పవిత్ర జీవిత చరిత్రను ప్రస్తావించిన తర్వాత హజ్రత్ ఖలీఫతుల్ మసీహిర్రాబె రహిమల్లాహు తఆలా ఇట్లనిరి.

“మీరు విన్న ఈ విషయాలను పాటించుటకు అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! ఈ విషయాలు మీ మనసులలో విప్లవం సృష్టించుగాక! మీ కొరకు విభిన్న ఆదర్శములు కనిపించుగాక! ఆయా ఆదర్శాలను మీరు పాటింతురు గాక! ఈ విషయంను తెలుపుతు పవిత్ర ఖుర్ఆన్ ఇట్లు సూచించెను.

وَلِكُلٍّ وِّجْهَةٌ هُوَ مُوَلِّيْهَا فَاسْتَبِقُوا الْخَيْرٰتِ (అల్ బఖరహ్: 149) అనగా ప్రతి వ్యక్తికి ఒక లక్ష్యముండును. దాని ప్రభావము అతనిపై ప్రబలముగా నుండును. కనుక సత్కార్యములను అహమహమికతో (ఒకరినొకరు పోటీతో) ఆచరింపుము.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్త్రీ అనుచరుల స్థాయి, అంతస్తును మరియు త్యాగాలను ప్రస్తావిస్తు మన ప్రియతమ ఇమామ్ హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి.

“ఇస్లాం పునర్ వైభవం కొరకు మనం మన పాత్రను పోషించుటకు అల్లాహ్ తఆలా మనలో మనల పిల్లలలో ఇటువంటి ప్రామాణికాన్ని కలిగించుకోవలెను. ఇవి కేవలం విన వలసిన కథలు కావు. అల్లాహ్ తఆలాతో సంబంధం ఏర్పరచుకొనుటకు ఈ ఉదాహరణలను జీవిత భాగాలుగా చేసుకోవలెను. ప్రార్థనలు, ప్రవక్త ప్రేమ, ఆర్థిక, ప్రాణ త్యాగాల ప్రామాణికాణ్ని ఏర్పరచుకోవలసిన అవసరమున్నది. నిస్సందేహంగా అహ్మదీ స్త్రీలు త్యాగాల ప్రామాణికాలను ప్రదర్శిస్తున్నారు. కాని ఆర్థికంగా స్థోమతి కలిగిన మహిళలు తమ పరిస్థితులను పరిశీలించుకోవలెను. ఎవరి భర్తలు ఆటంకంటగా మారుతారో వారికి చెప్పండి. ధార్మిక విషయాలలో మేము మీ మాటలు వినలేము. త్యాగ్యాల విషయానికి వచ్చినచో ధర్మం కొరకు త్యాగాలు సమర్పించుటలో అహ్మదియ్య జమాఅత్‌కు ఒక ప్రత్యేకత గలదు. ఇది తల్లుల శిక్షణ ప్రభావమే. పురుషుల త్యాగాల పుణ్యం వారి తల్లులకు కూడ లభిస్తుంది....దజ్జాల్ షైతానీ దాడుల వల వేసి ఉన్నాడని ఎల్లప్పుడు గుర్తుంచుకండి. ప్రార్థన, ప్రవక్త ప్రేమలో ముందడుగు వేయుటకు కృషి చేయవలసిన నేడు అవసరం అత్యధికంగా గలదు. పిల్లల శిక్షణ వైపు ప్రత్యేక శ్రద్ధ చూపవలెను. ధర్మంనకు ప్రాపంచికంపై ప్రాధాన్యత న్వివలెనని వారికి గట్టిగా చెప్పిండి. దేవుని కరుణ ఉప్పొంగేందుకు తగిన ఉత్సాహంతో దుఆలలో వేగం పెంచండి. తద్వారా మన బాల బాలికలు ప్రాపంచిక ఐశ్వర్యంలో పడే బదులు దేవుని ధర్మంను నేర్చుకొను, దేవునితో సంబంధం కలిగించుకొను, ప్రవక్త ప్రేమ ఉద్రేకం కలిగించుకొందురు గాక!

అల్లాహ్ తఆలా ప్రతి అహ్మదీ స్త్రీని ఈ ప్రామాణికం పొందుటకు అనుగ్రహించుగాక! ఇటు వైపు స్త్రీలు దృష్టి సారించడంతో పురుషుల సంస్కరణకు ఇది కారణమగును. స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు అందరు కలిసి స్వచ్ఛమైన సమాజమును స్థాపించువారగుదురు గాక! ఆ సమాజ నిర్మాణం కొరకే అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను పంపెను. ఇందుకు అల్లాహ్ తఆలా మనందరిని అనుగ్రహించుగాక! ఆమీన్

(ప్రసంగం: స్త్రీల వార్షిక జల్స యు.కె. 29 జూలై 2023 )

హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారి పై ఆదేశాలను పాటించుటకు అహ్మదీ స్త్రీలమైన మనందరిని అల్లాహ్ తఆలా అనుగ్రహించుగాక! అలాగే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ స్త్రీ అనుచరుల అడుగుజాడలలో నడుచుటకు అనుగ్రహించుగాక! ఇటువంటి ఆదర్శములు అహ్మది మహిళలమైన మనలో కూడ కనిపించుగాక! మొదటి కాలపు స్త్రీల వలె మనం ప్రతి త్యాగం కొరకు సిద్ధముందుము గాక!.

اِنَّ الصَّحَابَةَ كُلَّهُمْ كَذُكَاءِ
قَدْ نَوَّرُوا وَجْهَ الْوَرٰى بِضِيَاءِ
يَا رَبِّ فَارْحَمْنَا بِصَحْبِ نَبِيِّنَا
وَاغْفِرْ وَاَنْتَ اللّٰهُ ذُوالْاٰلَاءِ

అనగా అనుచరులందరు సూర్యుని వలె నున్నారు. వారు ప్రజల ముఖంను తమ కాంతితో ప్రకాశింప జేశారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల పేరున మమ్ములను కూడ కరుణించుము, మమ్ములను క్షమించుము. నిశ్చయంగా నీవే కరుణామయుడవు.

اللهم صل على محمد وعلى ال محمد كما صليت على ابراهيم وعلى ال ابراهيم انك حميد مجيد۔

اللهم بارك على محمد وعلى ال محمد كما باركت على ابراهيم وعلى ال ابراهيم انك حميد مجيد

వ ఆఖిరు దావానా అనిల్ హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్.‘

నూరుల్ ఇస్లాం శాఖ:

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**
**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**
**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz